



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




అమరావతి (చైతన్యరథం): జర్మనీ కాన్సులేట్ జనరల్ మైఖేల్ హాస్పర్‌తో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ, నైపుణ్యాభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో కలిసి ముందుకు సాగడంపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. భారతదేశం-జర్మనీ అభివృద్ధి ప్రయాణంలో కీలక భాగస్వామిగా ఉండటానికి ఏపీ సిద్ధంగా ఉందని లోకేష్ పేర్కొన్నారు.



## నీటిపారుదల పనులకు

# గ్రీన్ సిగ్నల్

- భూ బదిలీ చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఓకే
- ఆక్రమణల క్రమబద్ధీకరణకు గడువు పెంపు
- 24 అజెండా అంశాలపై మంత్రిమండలి చర్చ, ఆమోదం
- అసెంబ్లీ సమావేశాలకు పూర్తిగా ప్రిపేరై రావాలి
- ఇచ్చే సమాధానాలు క్లుప్తంగా, స్పష్టంగా ఉండాలి
- మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

6

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో బుధవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. అజెండాలోని 24 కీలక అంశాలపై చర్చించి ఆమోదించారు. నీటిపారుదల శాఖలో 7,189 పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రుల పనితీరు, ప్రవర్తనపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. కీలక సమావేశాల నేపథ్యంలో మంత్రులంతా స్పష్టమైన సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రతి మాట బాధ్యతగా ఉండాలన్నారు. శాఖలకు సంబంధించి సబ్జెక్టుపై పూర్తి అవగాహనతో, ప్రిపేరై అసెంబ్లీకి రావాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీలను అమరావతిలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.



- పునరుద్ధరణ దాటి ప్రగతి పథానికి ఏపీ
- సంక్షేమం, అభివృద్ధి.. జోడెద్దుల సవారీ
- ఏడు శ్వేతపత్రాలతో పారదర్శకతకు పెద్దపీట
- సంక్షేమం, అభివృద్ధి సమతుల్యతకు పది సూత్రాలు
- సంపద సృష్టికి మా ప్రభుత్వం నిర్మాణాత్మక కృషి
- హెల్దీ వెల్దీ హ్యాపీ ఏపీ ప్రభుత్వ లక్ష్యం
- శాశ్వత రాజధానిగా అమరావతి
- ప్రపంచంలోనే రాష్ట్రానికి ప్రత్యేక స్థానం
- బడ్జెట్ సమావేశాల ప్రారంభ ప్రసంగంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

## విఘాతం నుంచి

# వికాసం వైపు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలను చవిచూసిందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి నాటి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు రాష్ట్ర పురోగతికి విఘాతం కలిగించిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. “2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్రాభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగునీటి పారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవిచూశాయి. గత చేదు అనుభవాలతో విసిగి వేసారిన ప్రజలు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. గత 19 నెలలుగా మా ప్రభుత్వం పునరుద్ధరణ దశనుంచి ప్రగతి పథంవైపు పయనిస్తోంది. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రధానంగా దృష్టిపెట్టాం. విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు చేపట్టాం. ఏడు శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి పది సూత్రాలు రూపొందించాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశించింది” అన్నారు.

గవర్నర్ ప్రసంగం పూర్తి సారాంశం ... 2, 3ల్లో






## డిప్యూటీ సీఎం పవన్‌తో మంత్రి లోకేష్ మర్యాదపూర్వక భేటీ

అమరావతి (చైతన్యరథం): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో బుధవారం శాసనసభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ఐటీ, హెచ్‌ఆర్‌డీ మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప ముఖ్యమంత్రి పేషీలో ఇద్దరు నేతలు శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణతో పాటు పలు అంశాలపై చర్చించారు. అనంతరం రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్... ఉప ముఖ్యమంత్రి పవన్‌తో సమావేశమయ్యారు.

## 11... 11... 11



అమరావతి (చైతన్యరథం): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో అంతా ఊహించినట్టే జరిగింది. ఇలా వచ్చి అలా వెళ్లిపోయిన వైసీపీ వ్యవహారంపై సభాపతి అయ్యన్నపాత్రుడు అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. “గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభకు హాజరైన వైసీపీ సభ్యులు కాసేపు నిరసన తెలిపారు. 11వ తేదీన 11మంది 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా..!” అని అయ్యన్న సరదా వ్యాఖ్యలు చేశారు.




ఇరవై నెలల పాలనలో కూటమి ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలోనూ అనేక విజయాలు సాధించింది. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, సుపరిపాలనతో పతనం నుంచి ప్రగతివైపు... రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అనునిత్యం పనిచేస్తోంది. అనేక సవాళ్లను అధిగమించి ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పునరుద్ధరణతో ప్రజల ఆశలు నెరవేర్చుతూ.... స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా తలసరి ఆదాయం రూ.55 లక్షల పెంపునకు బాటలు వేస్తోంది. 20 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలు 90% నెరవేర్చింది. గత ప్రభుత్వం 85% హామీలు ఎగనామం పెట్టింది.

5

చైతన్యరథం

# విఘాతంనుంచి వికాసంవైపు..











- పునరుద్ధరణ దాటి ప్రగతి పథానికి ఏపీ
- సంక్షేమం అభివృద్ధి.. జోడెద్దుల సవారీ
- ఏడు శ్వేతపత్రాలతో పారదర్శకతకు పెద్దపీట
- సంక్షేమం అభివృద్ధి సమతుల్యతకు పదిసూత్రాలు
- సంపద సృష్టికి మా ప్రభుత్వం నిర్మాణాత్మక కృషి
- హెల్దీ వెల్దీ హ్యాపీ ఏపీ ప్రభుత్వ లక్ష్యం
- శాశ్వత రాజధానిగా అమరావతి..
- ప్రపంచంలోనే ఏపీకి ప్రత్యేక స్థానం
- బడ్జెట్ సెషన్స్ ప్రారంభ ప్రసంగంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి పునర్నిర్మాణం వేగంగా జరుగుతోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. శాశ్వత రాజధానిగా గుర్తించే ప్రక్రియను కేంద్రం ప్రారంభించిందని వివరించారు. నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా అమరావతిలో సరికొత్త అధ్యాయం ప్రారంభించామని, ప్రపంచంలోనే రాష్ట్రానికి ప్రత్యేక స్థానం కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టుల ద్వారా అద్భుతమైన ప్రజా రవాణా అందుబాటులోకి తెస్తామన్నారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నట్టు వివరించారు".

"ప్రజా సంక్షేమమనే కోణంలోనే ప్రతి నిర్ణయాన్నీ ప్రభుత్వం తీసుకుంటోంది. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ కార్యక్రమాలు అమలు చేస్తోంది. 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ప్రయోజనం కలిగిస్తున్నాయి. 66 లక్షల మందికి పైగా విద్యార్థులకు 'తల్లికి వందనం' ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. స్త్రీశక్తి పథకంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోంది. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20వేలు చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు.... 5,757 మంది కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ కూడా ప్రభుత్వం పూర్తి చేసింది. 'మత్స్యకార సేవలో' పథకం ద్వారా 1.2 లక్షల మందికి రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. లక్ష మందికి పైగా హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోంది" అని గవర్నర్ నజీర్ వివరించారు.

"జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ప్రతి కుటుంబానికీ అవసరమైన ప్రయోజనాలను అందిస్తున్నాం. త్వరలో ఫ్యామిలీ కార్డును అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పీ4 ద్వారా పేద, ధనికవర్గాల మధ్య తారతమ్యాలు తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఎవరూ ఆకలితో ఉండకూడదని 113 నియోజకవర్గాల్లో 205 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. త్వరలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ గ్రామీణ అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. అందరికీ గృహాలు అనే లక్ష్యంతో గృహాల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చేస్తున్నాం. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. బీసీల అభ్యున్నతికి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఎంఎస్ఎంఈల ద్వారా బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపట్టింది. మైనారిటీలకు భద్రత, వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్య, ఆర్థిక సహకారంతో మేలు చేకూరుస్తోంది. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని గవర్నర్ పేర్కొన్నారు.

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐటీ, క్వాంటం కంప్యూటింగ్‌లాంటి రంగాల్లో దూసుకెళ్తోంది. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తోంది. అంతర్జాతీయ సంస్థలు ఏపీని పెట్టుబడులు, నాలెడ్జి ఎకానమీకి గమ్యస్థానంగా ఎంచుకున్నాయి. టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్‌లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోంది. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి రూ.2.5 లక్షల వరకు సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోంది. 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోంది. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ప్రభుత్వం ఈ బృహత్ పథకాన్ని చేపడుతోంది. వృద్ధుల సంఖ్య పెరగడం వివిధ దేశాలకు సవాల్‌గా మారింది. దీనిపై సరైన విధానాన్ని రూపొందించాలని సభను కోరుతున్నాను. అక్రమ మద్యం తయారీ నుంచి విముక్తి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గంజాయి నిర్మూలనలో పురోగతి సాధించింది. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రణాళికలు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారు. అభివృద్ధి వ్యూహంలో మహిళలే కేంద్ర బిందువులు, ఆర్థిక భాగస్వాములు, 'స్వయం' పేరుతో డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తోంది. ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. వచ్చే ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అంగన్‌వాడీలను బలోపేతం చేసి, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తోంది. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం కూడా అందిస్తోంది" అని గవర్నర్ స్పష్టం చేశారు.

"ప్రాంతీయ సమానత్వానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పోర్టులు, రోడ్లు, విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాలు, పరిశ్రమల పెట్టుబడులతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, సేవా రంగాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆర్థిక క్రమశిక్షణ, పెట్టుబడుల్లో వేగం, మౌలిక వసతుల అభివృద్ధి వంటివి ఆర్థికకార్యకలాపాలకు దోహదపడుతున్నాయి. రాష్ట్రంలో సాగునీటి వ్యవస్థకు పోలవరం ప్రాజెక్టు వెన్నెముక. 2027 జూన్‌నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉంది. కరవు ప్రభావిత ప్రాంతాలకు హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా ప్రభుత్వం నీరు అందిస్తోంది. నల్లమల సాగర్-నదుల అనుసంధానం ద్వారా పోలవరం నుంచి గోదావరి వరద జలాలను తరలించాలని ప్రభుత్వం సంకల్పించింది. వంశధార నుంచి దక్షిణ భారతదేశంలోని నదీ వ్యవస్థలను అనుసంధానించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోంది. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల ఏర్పాటు, యాత్రికులకు వసతి, రవాణా వంటి ఏర్పాట్ల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించింది. 28 జిల్లాల సమగ్రాభివృద్ధికి మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి ప్రణాళికల్ని అమలుచేసేలా కార్యాచరణ చేపడుతోంది. విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా రీజియన్లు ఏర్పాటుచేసి ఈ ప్రణాళికలను అమలు చేస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన సిటీ ఎకనామిక్ రీజియన్లు ఈ ప్రణాళికలకు ఉపయోగపడతాయి. విజయవాడ, గుంటూరు, అమరావతి మధ్య రాజధాని నిర్మాణంతో లాజిస్టిక్స్, ప్రముఖ సంస్థల ఏర్పాటు, ఇతర ఆర్థిక లావాదేవీలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. ఈ మూడు ప్రాంతాలు టైర్-2 నగర సమూహంగా ఎదుగుతున్నాయి. పోర్టు ఆధారిత అభివృద్ధి, ఆక్వా కల్చర్, తీర ప్రాంత సుస్థిరాభివృద్ధి,

- (మిగతా వివరాలు 3లో)



# విఘాతంనుంచి వికాసంవైపు..

*(2వ పేజీ తరువాయి)*

రాయలసీమలో ఉద్యాన పంటలు, గిరిజన ప్రాంతాల్లో విలువ ఆధారిత అభివృద్ధిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో అమరావతి కొత్త అధ్యాయాన్ని మొదలు పెట్టింది. ప్రపంచంలో కొద్ది ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉండే క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థలను ఏపీలో స్థాపించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమరావతి పునర్నిర్మాణాన్ని ప్రభుత్వం వేగంగా చేపట్టింది. రాజధాని రైతుల్లో విశ్వాసం పెరిగింది. అమరావతిని శాశ్వత రాజధానిగా ఉండేలా చట్టబద్దత కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కూడా ప్రక్రియ ప్రారంభించింది. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైల్ వ్యవస్థను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో మూడు హైస్పీడ్ రైల్ కారిడార్‌లు ఏపీ మీదుగా వెళ్లనున్నట్టు ప్రకటించడం కీలకమైన అంశం. రాష్ట్ర ప్రభుత్వం 25కు పైగా కొత్త పాలసీలను ప్రకటించి రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. పారిశ్రామిక ప్రగతి కోసం 175 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక క్లస్టర్ల ద్వారా ప్రాంతీయ సమతుల్యతను ప్రభుత్వం సాధిస్తోంది. స్పేస్ సిటీ, ఏరోస్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, డ్రోన్ సిటీ, క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ సిటి, సెమీ కండక్టర్ ఎకో సిస్టంలాంటివి ఏపీ అభివృద్ధికి కీలకం అవుతాయి" అని గవర్నర్ పేర్కొన్నారు.

"గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సహా పునరుత్పాదక ఇంధం ద్వారా క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీని క్లీన్ ఎనర్జీ ఎకనామిక్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. విద్యుత్ వినియోగదారులపై భారం వేయకుండా రూ.4,498 కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. తొలిసారిగా ట్రూ డౌన్ విధానం ద్వారా ప్రజలపై యూనిట్‌కు 13 పైసల చొప్పున విద్యుత్ భారాన్ని తగ్గించింది. గతంలో తప్పుడు నిర్ణయాలతో ధ్వంసమైన ఏపీ విద్యుత్ రంగం ఇప్పుడు జాతీయ స్థాయిలో మోడల్‌గా అవతరించింది. తక్కువ ధరతో డేటా సెంటర్లకు విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సీఐఐ సదస్సు ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు 610 ఎంవోయూలు కుదిరాయి. వీటి ద్వారా 16.13 లక్షల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. 14 ఎస్ఐపీబీల ద్వారా 8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదాన్ని తెలిపి పరిశ్రమలు స్థాపించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా ఇచ్చి ఆ రంగంలో పెట్టుబడులకు ఊతమిచ్చేలా చర్యలు చేపట్టింది. కేంద్ర బడ్జెట్‌లో అరకు లోయ, పులికాట్ సరస్సుల వద్ద టూరిజం అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కూడా ప్రస్తావించారు.




వీటిని ఉపయోగించుకుని ఈ రంగంలో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు సాధించేలా చర్యలు చేపట్టింది. సాగునీటి రంగం అభివృద్ధిలో కీలకంగా మారింది. తక్కువ వర్షపాతం కలిగిన అనంతపురంలాంటి ప్రాంతాలు హార్టీకల్చర్ హబ్‌గా మారుతున్నాయి. 'పీఎం ప్రణామ్' పథకం ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గించి భూసారాన్ని మెరుగుపరిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. పొగాకు, కోకోవంటి పంటలకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా రైతులను ప్రభుత్వం ఆదుకుంది. 2030 నాటికి అరకు కాఫీ, కోకో ప్రాసెసింగ్‌లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది" అని వివరించారు.

"పరిపాలనా సంస్కరణలను తీసుకువచ్చి టెక్నాలజీ ద్వారా ప్రభుత్వం సులభరీతిలో సేవలు అందిస్తోంది. అలాగే డేటా ఆధారిత నిర్ణయాలను తీసుకుని వేగంగా సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. యువపారిశ్రామికవేత్తలు దీనిని అందిపుచ్చుకునేలా ప్రోత్సాహన్ని అందిస్తోంది. ప్రజలకు పాలనను మరింత దగ్గర చేసేందుకు 26 జిల్లాలను 28కి ప్రభుత్వం పెంచింది. భూ రికార్డులను డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా భద్రపరచడంతో పాటు సర్వే ప్రక్రియను పటిష్టంగా నిర్వహిస్తోంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయటంతో పాటు 22 (ఎ) కింద పెట్టిన భూములను ప్రభుత్వం సమీక్షిస్తోంది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. గత పాలకులు వదిలివెళ్లిన చెత్తను తొలగించి సర్క్యులర్ ఎకానమీని కూడా ప్రోత్సహిస్తోంది.

'మన మిత్ర' వాట్సప్ ద్వారా ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలను దగ్గర చేసింది. 18 ఏళ్ల వయసు లోపువారికి సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ విధించేలా చట్టం చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఆర్థిక ఒత్తిళ్లు, బాధ్యతలూ ఉన్నా క్రమశిక్షణతో పరిపాలన సాగిస్తోంది. 2025-26 అంచనాల ప్రకారం రాష్ట్ర జీఎస్డీపీ రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు చేరింది. వ్యవసాయంలో వృద్ధి 7.83 శాతం నమోదైంది. పరిశ్రమల రంగం 9.73 శాతం, సేవల రంగం 12.94 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది" అని గవర్నర్ అబ్దుల్ నజీర్ బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. అంతకుముందు అసెంబ్లీ వద్దకు చేరుకున్న గవర్నర్‌కు సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనమండలి చైర్మన్ మోషేరాజు స్వాగతం పలికారు.















# ఐక్యంగా, అప్రతిహతంగా..!

- మరో పదిహేనేళ్లు కూటమి పాలన సాగాలన్న సీఎం చంద్రబాబు
- గుజరాత్ తరహాలో సుదీర్ఘ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి
- ఎన్నికలకంటే.. సంక్షేమం, అభివృద్ధికి పెరిగిన మద్దతు
- ప్రభుత్వ విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి...
- ఎమ్మెల్యేలు, మంత్రులు ఓనర్షిప్ తీసుకోవాలి
- కేంద్రసాయం లేకుటే.. ఇన్ని కార్యక్రమాలు అసాధ్యం
- ఎన్నికలనాటి స్ఫూర్తి నిరంతరం కొనసాగాలి
- సభను పకడ్బందీగా నడుపుదాం... అర్ధవంతమైన చర్చలు సాగిద్దాం
- ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడాలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- 20 నెలల్లో ప్రగతిని నేతలకు వివరించిన సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో మరో 15 ఏళ్లపాటు కూటమి ఐక్యత ఇలాగే కొనసాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ఈ 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు ఏర్పడలేదని, ఇది శుభ పరిణామమని చెప్పిన సీఎం.. ఇదే ఐక్యత ఇకపైనా కొనసాగాలని, అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇందుకు తగ్గట్టుగా మంచి పనులు చేసి ఎమ్మెల్యేలు పేరు తెచ్చుకోవాలన్నారు. మొన్నటి ఎన్నికలకంటే నేడు కూటమి బలం, ప్రజల మద్దతు మరింత పెరిగిందని... ఎన్నికల ముందు ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తితో మున్ముందు పని చేయాలన్నారు. మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకువెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి ఉండాలన్నారు. అసెంబ్లీ కమిటీ హాలులో ఎన్డీఏ శాసనసభా పక్ష ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గుజరాత్‌లో వరుసగా ఐదుసార్లు బీజేపీ గెలిచి అధికారంలో ఉందని, ఇదే స్ఫూర్తితో ఇక్కడా విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడేలా అందరూ మంచి పేరు తెచ్చుకోవాలని సీఎం సూచించారు. ఈ 20 నెలల్లో చాలా కష్టపడి, ఐక్యంగా పని చేశామని సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ఐదేళ్ల విధ్వంసాన్ని అధిగమించి... ప్రగతివైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధికి 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుందని, ఐక్యంగా ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో... భవిష్యత్‌లో అలాగే పని చేయాల్సి ఉంటుందన్నారు. పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటే అంతర్గతంగా కూర్చుని వాటిని పరిష్కరించుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. కూటమి ధర్మానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని సూచించారు.

## అర్ధవంతమైన చర్చలు జరగాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'జిల్లాలవారీగా ఎమ్మెల్యే, ఎంపీలు, ఎస్పీ, కలెక్టర్లతో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తాం. పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగంగా ఎమ్మెల్యేల గౌరవాన్ని పెంచుతాం. నియోజకవర్గాల్లో పెండింగ్ పనులు గుర్తిస్తే ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేద్దాం. మనం చేసే అభివృద్ధి కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయి. మనం ఇంకా పూర్తిగా కోలుకోలేదు. కానీ వ్యవస్థలను గాడినపెట్టాం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నియోజకవర్గాల్లో చేసిన పనులను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలి. అసెంబ్లీ సమావేశాలను సభ్యులు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సభ్యులు అంతా సభలో ఉండాల్సిందే. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతా. సభ్యుల ప్రసంగాలు, మంత్రులు సమాధానాలు వింటాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. మా సమస్యలపై మా ఎమ్మెల్యేలు మాట్లాడారు, మంత్రులు సమాధానం చెప్పారు అని ప్రజలు అనుకోవాలి. విప్‌లు సంతృప్తికరంగా పని చేయాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభ జరగాలి' అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.



## కేంద్ర సాయంతోనే ఇంతటి పురోగతి

'నాడు ఎన్నికల్లో చెప్పిన అన్ని పథకాలు ఇస్తున్నామంటే కేంద్రం ఎంతో సహకారం అందిస్తోంది. అందుకే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడినపెట్టాం. కేంద్రం అమరావతి, పోలవరానికి డబ్బులు ఇవ్వకపోయి ఉంటే నేడు ఈ ప్రాజెక్టులు ప్రారంభమయ్యేవి కాదు. 2027 జూన్‌నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకిత చేస్తున్నామంటే కేంద్రం సాయం అందించడమే కారణం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర సాయంతో నిలబెట్టాం. మన ప్రజల కోసం, మన రాష్ట్రం కోసం, మన విశాఖ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుని సాయం చేసింది. ఇది చిన్న విషయం కాదు. కేంద్ర సాయంతో మొదటిసారిగా ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలను విశాఖ స్టీల్ ప్లాంట్ సాధించింది. ఇదేస్థాయిలో పని చేస్తే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిలుస్తుంది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. కేంద్ర సహకారం వల్లనే ఇవన్నీ సాధ్యమవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్యేలు ఓనర్ షిప్ తీసుకోవాలి' అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## నాడు అధికారంలో వైసీపీ అరాచకాలు

ఎన్డీఏ-ఎల్పీ సమావేశంలో పాల్గొన్న వారిలో 90శాతం నాటి వైసీపీ ప్రభుత్వ బాధితులేనని సభ్యుల్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. నేడు నీతులు చెబుతున్న వైసీపీ నేతలు... నాడు అధికారంలో చేసిన అరాచకాలను మరిచిపోయారని విమర్శించారు. వాళ్ల హయాంలో పవన్ కల్యాణ్ విశాఖ వెళితే కనీసం కారు కూడా దిగనివ్వలేదన్నారు. హోటల్ గదినుంచి బయటకు రానివ్వకుండా అడ్డుపడ్డారని సీఎం గుర్తు చేశారు. తన అరెస్టు సమయంలో మద్దతుగా పవన్ కల్యాణ్ హైదరాబాద్ నుంచి వస్తుంటే... ఆయనకు అనేక అడ్డంకులు సృష్టించారని అన్నారు. విమానంలో వచ్చే అవకాశం లేకుండా చేశారని, రోడ్డుమార్గాన కూడా రానివ్వలేదన్నారు. ఇలా అనేక సవాళ్లను, ఇబ్బందులను ఎదిరించి కూటమి ఐక్యంగా నిలబడి ఎన్నికల్లో గెలిచిందని సీఎం వివరించారు.

## 20 నెలల పాలనలో ఎన్నో విజయాలు

రాష్ట్రంలో ప్రతీ రంగంలోనూ వృద్ధి నమోదైందని, విధ్వంసంనుంచి వికాసంవైపు పురోగతి సాధిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం 20 నెలల పాలనలో సాధించిన విజయాలు, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అతి తక్కువ కాలంలో ప్రజలు మెచ్చే పాలన అందించామని... ప్రజావసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 20 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ఈ విజయాలను, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ఓనర్షిప్ తీసుకోవాలని అన్నారు. 20 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన ప్రధాన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి.

- (మిగతా వివరాలు 5లో)





# 20 నెలల పాలన...

# కూటమి ప్రభుత్వ విజయాలు

*అమరావతి (చైతన్యరథం):*

1. ***తల్లికి వందనం:*** రూ.10,090 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ. 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం
2. ***స్త్రీ శక్తి:*** 43.51కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు. రూ.1,532 కోట్లు ఖర్చు.
3. ***దీపం-2 పథకం:*** ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల పంపిణీ. ఇప్పటికి 3.64 కోట్ల సిలిండర్లు అందజేత. ఇందుకు రూ.2,891 కోట్లు వ్యయం (ఫిబ్రవరి 8, 2026 వరకు)
4. ***అన్నదాత సుఖీభవ:*** 46 లక్షల మంది రైతులకు... రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ.
5. ***మెగా డీఎస్సీ:*** ముఖ్యమంత్రి తొలి సంతకం. 15,941 టీచర్ పోస్టుల భర్తీ - 5,757 కానిస్టేబుళ్ల నియామకం - రూ.21 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ - 25 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన
6. ***పి4:*** 10 లక్షల మంది మహిళలకు రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు లబ్ధి చేకూర్చడమైనది.
7. ***ఎన్టీఆర్ భరోసా:*** ప్రతినెలా 63 లక్షల మందికి పింఛన్లు. ఇప్పటికి రూ.58,654 కోట్లు వ్యయం. దేశంలో అత్యధిక మొత్తంలో అధిక మందికి పింఛన్లు ఇస్తున్న రాష్ట్రంగా రికార్డు.
8. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం. వీరు ఎక్కడైనా పింఛను తీసుకునే అవకాశం.
9. ***మత్స్యకార సేవ:*** ఏడాదికి 20వేలు చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు.
10. నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25వేలు, జూనియర్ లాయర్లకు రూ.10వేలు గౌరవ వేతనం చెల్లింపు.
11. నేతన్నలకు ఉచిత విద్యుత్: మర మగ్గాలకు నెలకు 500, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
12. గీత కార్మికులకు 10శాతం మద్యం షాపులు కేటాయింపు- స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు.
13. ***ఆటో డ్రైవర్ల సేవలో:*** ఏడాదికి రూ.15వేలు. రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ధి.
14. ***అన్న క్యాంటీన్:*** రాష్ట్రవ్యాప్తంగా 205 అన్న క్యాంటీన్లు ద్వారా 7.50 కోట్ల మందికి భోజనాలు.
15. ***ఎస్సీ వర్గీకరణ:*** వివాదాలకు తావివ్వకుండా అన్ని వర్గాలకు సమన్యాయం
16. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5వేలు చొప్పున గౌరవ వేతనం
17. ఇమామ్‌లకు నెలకు రూ.10వేలు, మౌజన్లకు రూ.5వేలు చొప్పున గౌరవ వేతనం
18. అర్చకులకు వేతనం నెలకు రూ.15వేలకు పెంపు
19. రాష్ట్రవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మతులు. మరో రూ.3వేల కోట్లతో నూతన రహదారుల నిర్మాణం-పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో నాలుగు వేల కి.మీ. రోడ్ల నిర్మాణం
20. రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ - రెవెన్యూ సదస్సులు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు.
21. ***పంచాయతీరాజ్:*** రాష్ట్రమంతటా ఒకేరోజు 13,326 గ్రామసభల నిర్వహణ, దాదాపు 3వేల పనులకు శ్రీకారం... పంచాయతీరాజ్ వ్యవస్థలో పదోన్నతులు, 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల. ప్రతి ఇంటికీ 'అమరజీవి జలధార' పేరుతో మంచినీటి కుళాయి కనెక్షన్లు. రూ.3,050 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన, 1.21 కోట్ల మంది దాహార్తి తీర్చాలని లక్ష్యం. అడవితల్లి బాటతో గిరిజన తండాలకు రోడ్ల నిర్మాణం, శివారు గ్రామాలకు 4జీ నెట్‌వర్క్-శరవేగంగా గ్రామీణ రహదార్ల నిర్మాణం.
22. ***విద్యా రంగం:*** విద్యా వ్యవస్థలో పెనుమార్పులు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్-గిన్నిస్ రికార్డ్. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్, పారదర్శకంగా టీచర్ల బదిలీలు. విద్యార్థుల్లో పరిశుభ్రత పెంచేలా 'ముస్తాబు' - రూ.2,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపు-వన్ క్లాస్-వన్ టీచర్ అమలు.
23. గేట్స్ ఫౌండేషన్, టాటాలతో సంజీవని ప్రాజెక్టు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరునికీ రూ.2.5 లక్షల సమగ్ర ఆరోగ్య బీమా - దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 1.43 కోట్ల కుటుంబాలకు రూ.25 లక్షల వరకు ఆరోగ్య భద్రత - ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం - మెరుగైన సేవలందిస్తున్న 108, 104.
24. గాడిన పడిన విద్యుత్ రంగం-తొలిసారి ట్రూ డౌన్ ద్వారా 13 పైసలు విద్యుత్ చార్జీ తగ్గింపు- రూ.4,494 కోట్ల విద్యుత్ బకాయిలను భరించే బాధ్యత తీసుకున్న ప్రభుత్వం.
25. సివిల్ సప్లయిస్ బలోపేతం-నాణ్యమైన సరుకులు పంపిణీ-ప్రజలకు అందుబాటులో రేషన్ దుకాణాలు-జొన్నలు, రాగులు, గోధుమలు, కందిపప్పు... వంటి పౌష్టికాహారం పంపిణీ -స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.
26. ప్రతినెలా 3వ శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'. పట్టణ ప్రాంతాల్లో 100 శాతం డోర్ టు డోర్ కలెక్షన్... ఇప్పటికి 105 లక్షల టన్నుల చెత్త తొలగింపు. చెత్తపై పన్ను రద్దు.
27. కొత్తగా 25 పాలసీలు-పరిశ్రమగా పర్యాటక రంగం గుర్తింపు-పరిశ్రమలకు రాయితీల కోసం దేశంలో తొలిసారి ఎస్క్రో ఖాతాలు-175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శ్రీకారం
28. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్'లో భాగంగా తొలి దశలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు.
29. విశాఖలో 15 బిలియన్ డాలర్లతో(రూ.1.25 లక్షల కోట్లు) గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు.
30. అమరావతిలో క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన. విశాఖ ఐటీ హబ్, రిలయన్స్ డేటా సెంటర్‌కు అడుగులు, టీసీఎస్ ప్రారంభం, కాగ్నిజెంట్‌కు శంకుస్థాపన.
31. కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన. రెండేళ్లలో ఎగుమతులు.
32. తిరుమల సహా దేవాలయాల సేవల్లో పెను మార్పులు, 20కిపైగా ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానాలు.
33. విశాఖలో యోగాంధ్ర నిర్వహణ.. కర్నూలులో సూపర్ జీఎస్టీ సభ సక్సెస్.
34. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం-పేద విద్యార్థులకు అదనంగా 220 వైద్య విద్య సీట్లు.
35. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతం... పెరిగిన మూలధన వ్యయం.
36. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఉచితంగా స్థలం కోసం దరఖాస్తుల స్వీకరణ పూర్తి. 3లక్షల ఇళ్లకు ఇప్పటికే గృహప్రవేశాలు. త్వరలో మరో 5లక్షల ఇళ్ల ప్రారంభం.
37. ఉచిత ఇసుక పథకం అమలు. నాలా యాక్ట్ రద్దుతో పాటు నిర్మాణరంగ అనుకూల నిర్ణయాలు.
38. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్. బీసీలకు రూ.20వేల అదనపు సాయం.
39. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు- బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు.
40. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్, డేటా డ్రివెన్ డెసిషన్స్, వాట్సప్ గవర్నెన్స్-'మన మిత్ర' ద్వారా 921 సేవలు-తగ్గిన క్రైమ్ రేట్, గంజాయి-డ్రగ్స్ అరికట్టాం, ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు.
41. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణ-ఒకే రాజధాని. అభివృద్ధి వికేంద్రీకరణ కూటమి లక్ష్యం.
42. పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి దక్కిన చోటు-రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరింత ఆస్కారం- రాయలసీమకు సెమీ కండక్టర్-ఓర్వకల్, కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్-కడప స్టీల్ ప్లాంట్ - సోలార్ హబ్, దుగరాజపట్నం ఓడరేవు, రామాయపట్నం ఓడరేవు... లక్ష కోట్లతో బీపీసీఎల్- దగదర్తి ఎయిర్‌పోర్టు భూసేకరణకు నిధులు కేటాయింపు
43. ప్రారంభమైన విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం పనులు-ప్రారంభంకానున్న భోగాపురం విమానాశ్రయం.
44. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల కేంద్ర సాయం - నష్టాల నుంచి లాభాల బాట.
45. దాదాపు 90 కేంద్ర పథకాల పునరుద్ధరణ, కేంద్ర నిధుల సద్వినియోగం... పేద వర్గాలకు మేలు.
46. రాష్ట్రానికి రూ.లక్ష కోట్లు విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు
47. కొత్తగా రెండు జిల్లాల ఏర్పాటు. 26 నుంచి 28కి పెరిగిన జిల్లాల సంఖ్య. రెవెన్యూ డివిజన్లు 81కి చేరాయి. మొత్తం మండలాల సంఖ్య 680.
48. మహిళలకు లక్ష కుట్టుమిషన్ల పంపిణీ. కుప్పంలో 5,555 ఈ-సైకిళ్లు (రూ.11వేలు సబ్సిడీ).
49. రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ, 24 గంటల్లో జమ. 2024-25లో 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ- రూ.13వేల కోట్లు రైతులకు జమ.... 2025-26 ఖరీఫ్‌లో 44 లక్షల టన్నుల ధాన్యం సేకరణ.
50. మార్కెట్ ఇంటర్వెన్షన్-పొగాకు, మామిడి, కోకో, ఉల్లి, టమోటా సహా పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం.
51. సమర్థ నీటి నిర్వహణతో 6.08 మీటర్లకు పెరిగిన భూగర్భ జలాలు (ఫిబ్రవరి, 2026)
52. సాగునీటి ప్రాజెక్టులకు ఈ 20 నెలల్లో రూ.23,793 కోట్ల ఖర్చు
53. రూ.3,500 కోట్లు ఖర్చుతో హంద్రీ-నీవా పనులు పూర్తి చేసి సీమకు 43 టీఎంసీల తరలింపు ఒక రికార్డు.
54. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.571 కోట్లు వ్యయం- వేగంగా లైనింగ్, రిటైనింగ్‌వాల్ పనులు.
55. శరవేగంగా 88% పోలవరం నిర్మాణం-2027 పుష్కరాలకు పోలవరం ప్రారంభం-2019లో చంద్రబాబు ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం, నదుల అనుసంధానం పూర్తయి ఇప్పటికే కరవురహిత రాష్ట్రం ఏర్పడి ఉండేది.
56. తుంగభద్ర గేట్ల మరమ్మతులకు ఏపీ వాటాగా రూ.55 కోట్లు కేటాయింపు
57. ధవళేశ్వరం, శ్రీశైలం, కండలేరు, మైలవరం, గుండ్లకమ్మ, గోరకల్లు, అవుకు వంటి ప్రాజెక్టులకు రూ.610కోట్లతో మరమ్మతులు. రాష్ట్రవ్యాప్తంగా రూ.878 కోట్లతో కాలువల నిర్వహణ, పూడికతీత.
58. నీటి భద్రత-సమర్థ నీటి నిర్వహణతో పెరిగిన భూగర్భ జలాలు - 6,047 సాగునీటి సంఘాలకు ఎన్నికలు
59. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రం మీదుగా వెళ్లే 3 హైస్పీడ్ రైల్ కారిడార్ల కేటాయింపు.
60. ఆర్థిక కష్టాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులకు, బకాయిలు, టీఏ,డీఏ, సరెండర్ లీవ్‌లు, బెనిఫిట్స్ చెల్లింపు-ఆరోగ్యశ్రీ, పెండింగ్ బిల్లులు వంటి రూ.40వేల కోట్ల బకాయిలు చెల్లింపు.

సూపర్ హిట్

యువ గళం

అన్నదాత

మహాశక్తి

ఇంటింటికీ నీరు

పూర్ టు రిచ్

బీసీలకు రక్షణ చట్టం

# నీటిపారుదల పనులకు గ్రీన్‌సిగ్నల్

- 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం
- భూబదలీ చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఓకే
- ఆక్రమణల క్రమబద్ధీకరణకు గడువు పెంపు
- 24 అజెండా అంశాలపై మంత్రిమండలి చర్చ, ఆమోదం
- సెషన్స్‌కు పూర్తిగా ప్రిపేరై రావాలి
- ఇచ్చే సమాధానాలు క్లుప్తంగా.. స్పష్టంగా ఉండాలి
- అసెంబ్లీ సమావేశాలపై మంత్రులకు సీఎం దిశా నిర్దేశం



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో బుధవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. అజెండాలోని 24 కీలక అంశాలపై చర్చించి కేబినెట్ ఆమోదించింది. నీటి పారుదలశాఖలో 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. భూముల బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును 30-06-2026 వరకు పొడిగించేందుకు క్యాబినెట్ ఆమోదించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కీసరపల్లి గ్రామంలోని సర్వే నం.29/8లోని 3.84 ఎకరాల భూమిని "కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం" కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.6 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్‌ఆర్‌ఈడిసీఏపీకి కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపనకు కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లాలో 1500 ఎకరాల భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఎన్‌ఆర్‌ఈడిసీఏపీకి కేటాయించనున్నారు. ఎకరాకు ఏటా రూ.31,000 లీజ్ చెల్లించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదించింది. ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్‌కి ఆమోదం తెలిపింది. విశాఖపట్నం ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో 18.57 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయింపుపై మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తిరుపతిలో ఏపీఎస్‌డీసీ కోసం డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. డీఎస్‌డబ్ల్యూఎస్ (సవరణ) బిల్లు 2026ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు కేబినెట్ గీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతి మెరినా అభివృద్ధికి (పీపీపీ మోడల్) 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన, టెండర్లకు ఆహ్వానించింది. పీఎంఏవై గ్రామీణ్ 2.0లో యూనిట్ ఖర్చు రూ.2లక్షల 39 వేలుగా నిర్ణయించి క్యాబినెట్ అంగీకారం తెలిపింది.

రామాయపట్నం పోర్ట్ అభివృద్ధి కార్పొరేషన్ రుణ పునర్విినియోగం, రాష్ట్ర హామీ, కంఫర్ట్ లెటర్ జారీ తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించింది. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రచురణకు ఏడాదికి 4 అర్హత తేదీలను కల్పించేందుకు సవరణ బిల్లుకు కేబినేట్ ఆమోదించింది. యాగంటి పీఎస్పీ (1000 ఎండబ్ల్యూ), రాజుపాలెం పీఎస్పీ (800 ఎండబ్ల్యూ) ప్రాజెక్టులను ఏపీ జెన్కో స్వతంత్రంగా అమలు చేయడానికి ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఏపి ట్రాన్స్‌కోలో కడప జోన్ పరిపాలన కోసం అసిస్టెంట్ సెక్రటరీ పోస్టు సృష్టి ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. సుజ్లాన్ మరియు యాక్సిస్ సంస్థల అభ్యర్థన మేరకు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల అమలు గడువును మరో రెండేళ్లు పొడిగిస్తూ మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఊతమివ్వడంతో పాటు సామాన్యులకు భూముల సమస్యలనుంచి ఉపశమనం కలిగించే అవకాశముంది.

## మంత్రులకు సీఎం దిశా నిర్దేశం:

కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రుల పనితీరు, ప్రవర్తనపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. కీలక సమావేశాల నేపథ్యంలో మంత్రులంతా స్పష్టమైన సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా అసెంబ్లీలోనే ఉండాలని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత తమ పేషీల్లో ఉండి ఎమ్మెల్యేల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే, ఏ ప్రశ్నకైనా సమాధానాలు సుదీర్ఘంగా కాకుండా.. క్లుప్తంగా, స్పష్టంగా, అర్థమయ్యేరీతిన జవాబివ్వాలని మంత్రులకు సూచించారు. మాట్లాడే ప్రతి మాట బాధ్యతగా ఉండాలని హెచ్చరించారు. అలాగే, శాఖలకు సంబంధించి సబ్జెక్టుపై పూర్తి అవగాహనతో, ప్రిపేరై అసెంబ్లీకి రావాలని సూచించారు.

## కీలక మార్పులు - నిర్ణయాలు:

రాష్ట్రంలోని వార్డులు, సచివాలయాల పేర్లను 'స్వర్ణ వార్డు', 'స్వర్ణ సచివాలయాలు'గా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సోలార్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం అసైన్డ్ భూములను కౌలుకు ఇచ్చేందుకు అనుమతినిచ్చారు. దీనికింద ఏడాదికి ఎకరాకు 30 వేల రూపాయల కౌలు, ప్రతి రెండేళ్లకు 5 శాతం పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. ఏపీకి రావాల్సిన 12 వేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేసేందుకు కేంద్రం అంగీకరించిందని, ఈ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఎం చంద్రబాబు వివరించారు.

## అమరావతికి మహర్దశ:

కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీలను అమరావతిలోనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి కేంద్రానికి చేసిన సూచనలకు సానుకూల స్పందన వచ్చిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే, శ్రీశైలంలో భక్తుల రద్దీ సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై సీఎం చర్చించారు. వృద్ధులను క్యూలైన్ల నుంచి బయటకు తెచ్చే సమయంలో భక్తులకు తప్పుడు సంకేతాలు వెళ్లకుండా, మైక్ ద్వారా ముందే అనౌన్స్‌చేసి వివరించి ఉండాల్సిందని సీఎం అన్నారు. జిల్లాల్లోని ప్రాజెక్టుల గురించి ఇన్‌ఛార్జ్ మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎం చంద్రబాబు మంత్రులను ఆదేశించారు.

# మార్చి 7 వరకు అసెంబ్లీ

- అవసరమైతే మరిన్ని రోజులు పొడిగింపు
- సభాపతి అధ్యక్షతన సాగిన బీఏసీ నిర్ణయం
- 17 పనిదినాలు కొనసాగనున్న అసెంబ్లీ
- 14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి
- 17, 18 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ..
- 24 నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడలు
- మార్చి 6న అమరావతిలో సాంస్కృతిక కార్యక్రమాలు

అమరావతి (చైతన్య రథం): ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన బుధవారం బీఏసీ సమావేశం జరిగింది. మార్చి 7వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని.. అవసరమైతే పొడిగించాలని సమావేశంలో నిర్ణయించారు.

17 రోజులపాటు అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఈనెల 14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 15 ఆదివారం కాగా.. మహా శివరాత్రి తర్వాత రోజు 16న సెలవు ప్రకటించారు. 17, 18 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ జరగనుంది. 18న ఆర్థిక మంత్రి సమాధానం ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. మార్చి 1, 2, 3 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మార్చి 6న అమరావతిలోనే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగించాలని.. రోజూ జీరో అవర్ నిర్వహించాలని బీఏసీ భేటీలో నిర్ణయించారు. డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌పై 8 రోజులపాటు చర్చ జరగనుంది. ఆరు ఆర్డినెన్స్‌లకు సభ ఆమోదం తెలపనుంది.

# బైకుపై మృతదేహం తరలింపు

- కర్లపాలెం ఘటనపై మంత్రి పార్థసారథి ఆరా
- కలెక్టర్, ఆసుపత్రి సూపరిన్టెంట్ నుంచి వివరాల సేకరణ
- పేదలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ

బాపట్ల (చైతన్య రథం): బాపట్ల ఏరియా ఆసుపత్రి నుండి ఒక మృతదేహాన్ని బైకుపై తీసుకెళ్లిన ఘటనపై బాపట్ల జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి జిల్లా కలెక్టర్ వి వినోద్‌కుమార్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. జిల్లాలో అందుబాటులో ఉన్న అంబులెన్సులు, అంబులెన్సుల కొరత, మహాప్రస్థానాలు తదితర అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. శవాన్ని బైకుపై తీసుకెళ్లేంత పరిస్థితి ఎందుకు వచ్చింది? అని కలెక్టర్‌ను ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం చింతపాలెం గ్రామానికి చెందిన నక్క నాగేశ్వరరావు మృతదేహాన్ని బైకుపై తీసుకెళ్లిన ఘటనపై తాను ఆరా తీశానని.. ఆసుపత్రి సిబ్బందికి చెప్పకుండా సదరు వ్యక్తులు నాగేశ్వరరావు మృతదేహాన్ని తీసుకెళ్లిపోయారని బాపట్ల ఏరియా ఆసుపత్రి సిబ్బంది చెప్పినట్లు కలెక్టర్ బదులిచ్చారు. అప్రమత్తంగా వ్యవహరించాలని.. పేదలకు ఏ ఇబ్బందీ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

## ప్రైవేటు వాహనం ఇచ్చేలోపే మృతదేహాన్ని తీసుకెళ్లిపోయారు: సూపరిన్టెంట్

బాపట్ల జిల్లా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెట్ డాక్టర్ కె.సిద్ధార్థతో మంత్రి పార్థసారథి ఫోన్‌లో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఏంటి? అని ఆరా తీశారు. ఏరియా ఆసుపత్రిల్లో మహాప్రస్థానం సౌకర్యం లేదని, ఒకవేళ ఎవరికైనా సొంతంగా వాహనాల్లో తమకు సంబంధించిన వారి మృతదేహాలను తీసుకెళ్లే పరిస్థితి లేకపోయినా, ఆర్థిక పరిస్థితులవల్ల ఇబ్బంది ఉన్నా.... ఆసుపత్రి నుండి ప్రభుత్వ ఖర్చులతో ఒక ప్రైవేటు వాహనాన్ని ఇస్తున్నామని, దీనిపై జిల్లా కలెక్టర్‌నుండి సర్క్యులర్ కూడా ఉందని వివరించారు. సదరు ఘటనకు సంబంధించిన విషయంలో ఆసుపత్రి సిబ్బందికి తెలియకుండా నాగేశ్వరరావు మృతదేహాన్ని బైకుపై తీసుకెళ్లిపోయారని వివరించారు. నాగేశ్వరరావు ఇంటివద్దే గుండెపోటుతో చనిపోయారని, బాపట్ల ఏరియా ఆసుపత్రికి చనిపోయిన తర్వాత తీసుకొచ్చారని పేర్కొన్నారు. సొంత వాహనం మాట్లాడుకుని తీసుకెళతామని నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందికి చెప్పి, సిబ్బంది వేరొక ఎమర్జెన్సీ కేసును చూసే పనిలో ఉన్న సమయంలో ఈవిధంగా బైకుపై తీసుకెళ్లిపోయారని మంత్రికి వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావులేకుండా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, జాగ్రత్త పడాలని సూచించారు. తమ సొంత ఖర్చులతో ఎవరైనా తమ కుటుంబీకులు చనిపోతే తీసుకెళ్లలేని పరిస్థితులుంటే... ఆసుపత్రి నుంచి ప్రైవేటు వాహనాన్ని సత్వరమే కేటా యించి మృతదేహాన్ని ఇంటికి చేర్చాలని సూపరింటెండెంట్‌కు మంత్రి ఆదేశాలిచ్చారు.

# విపక్షం తీరు బాధాకరం

### శాసనసభ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

అమరావతి (చైతన్య రథం): అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేల తీరు బాధాకరమని శాసనసభ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. వైసీపీ ఎమ్మెల్యేలు హాజరీ కోసమే అసెంబ్లీకి వచ్చి వెళ్లారు తప్ప, రాష్ట్రాభివృద్ధి.. ప్రజాప్రతినిధులుగా కర్తవ్య నిర్వహణపై ఏమాత్రం బాధ్యత ప్రదర్శించలేకపోయారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్యేల వైఖరి గవర్నర్ ప్రసంగాన్ని అపహాస్యం చేయడానికే వచ్చినట్టుందని అంటూ.. గవర్నర్ ప్రసంగాన్ని జగన్ అపహాస్యం చేయడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి హాజరయ్యే తీరిక... చర్చల్లో పాల్గొనే ఓపిక వైసీపీ ఎమ్మెల్యేలకు లేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు త్వరలో ముఖ గుర్తింపు హాజరు నమోదు చేస్తామని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. సభా సంప్రదాయాలను గౌరవిస్తూ.. చర్చలు అర్థవంతంగా సాగించి.. ప్రభుత్వ లక్ష్యాలు, పనితీరును ప్రజలకు తెలియజేస్తామని జీవీ పేర్కొన్నారు. "11 సంఖ్య వైకాపా ఎమ్మెల్యేలకు బాగా నచ్చినట్టుంది. అందుకే కేవలం 11 నిమిషాల్లోనే సభ నుంచి నిష్క్రమించారు" అని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చమత్కరించారు.



# పవన్‌కళ్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

## గ్రామాల అభివృద్ధికి నిధులపై కృతజ్ఞతలు



అమరావతి(చైతన్యరథం): ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కలిశారు. తమ నియోజకవర్గాల పరిధి లోని గ్రామాల్లో పల్లెపండగ 2.0, సాస్కీ నిధులతో రోడ్లు, డ్రైన్లతో పాటు జేజేఎం నిధులతో రక్షిత మంచినీటి పథకాల పనులు, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం శాసనసభలో జరిగిన ఎన్డీఏ ఎల్పీ భేటీ అనంతరం వీరంతా పవన్‌ను కలిశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ముమ్మిడి వరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు కలిసిన వారిలో ఉన్నారు. అంబేద్కర్ కోనసీ మ జిల్లా పరిధిలోని ఆయా నియోజకవర్గాల పరిధిలో రూ.65.15 కోట్ల సాస్కీ నిధులతో 40 ప్రధాన రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. అందులో మండపేట నియోజకవర్గానికి రూ.22.75 కోట్లు, అమలాపురం నియోజకవర్గానికి రూ.16.18 కోట్లు, కొత్తపేటకు రూ. 14.93 కోట్లు, ముమ్మిడివరం నియోజకవర్గానికి రూ. 11.28 కోట్లు కేటాయించారు. 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి వాడపల్లి క్షేత్రానికి వెళ్లే కరకట్ట రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యానందరావు అభ్యర్థన మేరకు సాస్కీ నిధుల నుంచే రూ.6 కోట్లు మంజూరు చేశారు.

### పలువురు ప్రజా ప్రతినిధుల భేటీ

శాసనసభలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను పలువురు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాళహస్తి ఎమ్మె ల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గాల పరిధిలో పలు సమస్యలను పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. శ్రీకాళహస్తిలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ బొజ్జల సుధీర్‌రెడ్డి ఆహ్వానపత్రిక అందజేశారు.

# మకర వాహనంపై కామాక్షమ్మ

## సోమస్కందమూర్తిగా భక్తులకు దర్శనం



తిరుపతి (చైతన్యరథం): నగరంలోని కపిలేశ్వరస్వామి బ్రహ్మో త్సవాల్లో నాలుగో రోజైన బుధవారం ఉదయం కపిలేశ్వర స్వామి సోమస్కందమూర్తిగా కామాక్షి అమ్మవారి సమేతంగా మకర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భజన మండళ్ల కోలాటాలు, భజనలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. మకరం గంగాదేవికి నిత్యవాహనం. గంగ పరమశివుని శిరస్సుపై నివసిస్తోంది. గంగా దేవి వాహనమైన మకరం తపమాచరించి శివానుగ్రహాన్ని పొంది ఆ పరమశివునికి వాహనమైందని శైవాగమాలు తెలియ జేస్తున్నాయి. మకరం జీవప్రకృతికి ఉదాహరణ. భగవంతుని ఆశ్రయించినంత వరకు జీవుడు నీటిలో మొసలిలా బల పరాక్ర మంతో జీవించవచ్చు. అనంతరం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సోమస్కందమూర్తి, కామాక్షిదేవి అమ్మ వారికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు, చందనంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ సూపరింటెండెంట్ కె.పి.చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు దామోదర్, రవికుమార్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


- పని ఒత్తిడి తగ్గించేందుకు నూతన నియామకాలు
- దేశంలో కరెంట్ ఛార్జీలు ట్రూ డౌన్ చేసింది ఏపీనే
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- బీసీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వ ర్యంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతతో పరిష్కరిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌తో కలిపి బుధవారం మంత్రి గొట్టిపాటి సచివాలయం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో సంతృ ప్తి స్థాయిలు పెరిగేలా విద్యుత్ ఉద్యోగులు విధులు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్ ఉద్యోగులపై ఉన్న పని ఒత్తిడి ని తగ్గించేందుకు సీఎం చంద్రబాబు అనుమతితో త్వరలోనే నూత న నియామకాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మెడికల్ ఇన్సూరె న్స్ లిమిట్‌కు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. అదే విధం గా విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన డిమాండ్లలో 90 శాతం పైగా పరిష్కరించామని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిన విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడుతున్నా మని పేర్కొన్నారు. ట్రూ అప్ ఛార్జీలను ట్రూ డౌన్ చేసిన రాష్ట్రం కూడా దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అని స్పష్టం చేశారు. ప్రైవేటు సంస్థల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లను తగ్గించడమే కాకుండా రాష్ట్రంలో ఉన్న వనరులను వినియోగించుకుని రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఏదేమైనా విద్యుత్ ఉద్యో గులకు అన్ని విషయాల్లోనూ సహాయ, సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలను నేడు దేశంలో అనేక రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. టీడీపీ అంటేనే బీసీలు అని, బీసీలు అంటేనే టీడీపీ అని పేర్కొన్నారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పీఆర్సీ, డీఏ, ఇంక్రిమెంట్లతో పాటు విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కే.అప్పారావు, ఫైనాన్స్ సెక్రటరీ ఎస్.వెంకట రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ జీ.రాము, బీసీ సంఘం నేత కేశన శంకర్రావుతో పాటు వివిధ జిల్లాల నుంచి పలువురు ఉద్యోగ సంఘ నేతలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వ్యర్థాల సరిచేసి ర్యాంకులు మెరుగుపరచాలి

- పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణపై దృష్టి
- గత లోపాలను సరిదిద్దాలి
- పబ్లిక్ టాయిలెట్స్‌కు నిధులకు సమస్య లేదు
- నెగెటివ్ మార్కులు తగ్గించి, ఫీడ్‌బ్యాక్ పెంచాలి
- మహిళలు, వికలాంగుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ
- మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



అమరావతి (చైతన్యరథం): గత ఏడాది స్వచ్ఛ సర్వే క్షణ్‌లో వెలుగుచూసిన లోపాలను సరిదిద్ది, ఈ సారి మెరుగైన ఫలితాలు చూపాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మున్సిపల్ అధికారులకు పిలుపు ఇచ్చారు. అమరావతిలోని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ కార్యాలయం నుంచి ఆయన రెండవ రోజు బుధవారం గుంటూరు, అనంతపురం రీజియన్లలోని మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ సర్వే క్షణ్ బృందాలు ఒక నెలలో వస్తాయని తెలిపారు. ఈ సారి జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించడం కోసం ముందుగా పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ పనులను సమీక్షిస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాలను వేరుచేయడం(సోర్స్ సెగ్రిగేషన్)పైన, పబ్లిక్ టాయిలెట్స్, నాళాల క్లీనింగ్, పాఠశాలలు, పర్యాటక ప్రాంతాలు, పార్కులు వంటి పబ్లిక్ ప్రదేశాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చైర్మన్ చెప్పారు. ఆయా మున్సిపాల్టీలలో వివిధ విభాగాలలో పనితీరుపై వచ్చిన నెగెటివ్ మార్కుల వల్ల గత ఏడాది ర్యాంకులు తగ్గుతాయని తెలిపారు. నెగెటివ్ మార్కులు తగ్గించుకున్నప్పుడే మంచి ర్యాంకు వస్తుందన్నారు. అందువల్ల, గత స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏఏ అంశాలలో నెగెటివ్ మార్కులు వచ్చాయో, ఈసారి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, నెగెటివ్ మార్కులను జీరో చేయడానికి ప్రయత్నించాలని సూచించారు. దాదాపు అన్ని మున్సిపాల్టీలకు ఒకే రకమైన అంశాలలో మైనస్ మార్కులు వచ్చాయని గుర్తు చేశారు. అందువల్ల కాలవల్లో చెత్త పేరుకుపోయి, మురుగునీటి ప్రవాహం ఆగిపోవడం, ఇళ్లు, పాఠశాలల వద్దే తడి, పొడి, ప్రమాదకరమైన వ్యర్థాలను వేరు(సోర్స్ సెగ్రిగేషన్) చేయడం, ఐఈసీ(ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్), సీబీ(కెపాసిటీ బిల్డింగ్) కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. ప్రజలను భాగస్వాములను చేసే విధంగా ఐఈసీ, సీబీ కార్యక్రమాలను ఏఐఐఎల్ఎస్‌జీ, వాష్ ఏజన్సీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారు, మీరు పరస్పర సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏజన్సీల వారు మున్సిపల్ పరిపాలనా శాఖ రీజినల్ డైరెక్టర్లను కలిసి, వారితో చర్చించి, కార్యక్రమాలను చురుకుగా నిర్వహించాలని ఆదేశించారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు 500 నుంచి 1000 మార్కులకు పెంచారని, మన పనులు మనం సక్రమంగా నిర్వహిస్తే, సిటిజన్ ఫీడ్ బ్యాక్ బాగా వస్తుందన్నారు. అలాగే, సిటీ బ్యూటిఫికేషన్, సముద్ర తీర ప్రాంతాలు, నది ఒడ్డున ఉన్న పట్టణాలు, నగరాలలో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంటుందని చైర్మన్ పట్టాభిరామ్ చెప్పారు.

### పబ్లిక్ టాయిలెట్స్‌కు నిధులకు సమస్య లేదు

పబ్లిక్ టాయిలెట్స్‌కు నిధుల సమస్యలేదని, కొత్తవి కావాలంటే మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాలల్లో, ప్రైవేటు ప్రదేశాల్లోని టాయిలెట్స్ మహిళలకు, వికలాంగులకు ప్రత్యేకంగా వారికి కావలసిన సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. మహిళలకు శానిటరీ నేప్ కీన్స్, నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రతి మున్సిపాల్టీకి ఒక యాక్షన్ ప్లాన్ ఉండాలని, అందుకోసం తాము ఒక ఫార్మేట్ పంపుతామని, దానిని నింపి పంపాలని చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మున్సిపల్ పరిపాలనా శాఖ రీజినల్ డైరెక్టర్ సూర్యదేవర హరికృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# ఆలయాల్లో నిరంతర విద్యుత్‌కు చర్యలు

- మహాశివరాత్రి వేళ అంతరాయాలు ఉండకూడదు
- అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- డిస్కమ్‌లకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు



విజయవాడ (చైతన్యరథం): రాబోయే మహా శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాలు, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో ఏ విధమైన అంతరాయం లేకుం డా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ డిస్కమ్‌లను విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ ఆదేశించారు. బుధవారం డిస్కమ్‌ల సీఎండీలు ఎల్.శివశంకర్, ఐ.పృథ్వీతేజ్, పి.పుల్లారెడ్డిలతో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే శివరాత్రి పండుగను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా సన్నద్ధతపై ఆయన సమీక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రధాన శివా లయాలు, ఇతర దేవాలయాలకు వెళ్లే అవకాశం ఉన్నందున నిరంతర విద్యుత్ సరఫరా అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నా రు. భక్తుల సౌకర్యం కోసం, ధార్మిక కార్యక్రమాలు అంతరాయం లేకుండా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పండుగ కాలంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవస రమైతే ప్రత్యామ్నాయ విద్యుత్ అందించేలా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు 24/7 మెయింటెనెన్స్ బృందాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అను కోని సమస్యలు తలెత్తకుండా ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పంపిణీ లైన్లపై ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా తక్షణ పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలని, ఫీల్డ్ అధికారులందరూ అప్రమత్తంగా ఉండి కచ్చితమైన పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. మహా శివరాత్రి సందర్భంగా విద్యుత్ సరఫరా అం తరాయం లేకుండా ఉండేలా, భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకు నేలా ప్రతి డిస్కమ్ సక్రమంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# కల్పవృక్ష వాహనంపై శ్రీనివాసుడి రాజసం

**కల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు - రాజమన్నార్ అలంకారంలో దర్శనం**



తిరుపతి (చైతన్యరథం): శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంక టేశ్వరస్వామి బ్రహ్మోత్సవా ల్లో నాలుగో రోజైన బుధవారం ఉద యం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు రాజమన్నార్ అలం కారంలో దర్శనమిచ్చారు. శ్రీవారు చిలుకతో కూడిన దండం, ఆవు దూడ, లక్ష్మీ హారము, మకర కంఠి, స్వర్ణ యజ్ఞోప వీతం, కల్పితురాయి, సూర్యచంద్రులతో కూడిన కిరీటం, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు గజలక్ష్మి, మామిడి పిందుల హారం, కమల, లంబ హస్తలతో భక్తులను కటాక్షించారు. ఉదయం 8 నుండి 9 గంటల వరకు స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుం డగా మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. వాహనసేవలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్, కంకణభట్టార్ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పె క్టర్లు మునికుమార్, ధనశేఖర్ పాల్గొన్నారు.

నేడు గరుడసేవ

శ్రీనివాస మంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం రాత్రి విశేష మైన గరుడ వాహనసేవ అత్యంత వైభవంగా జరుగనుంది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు తనకు ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీవారి గరుడసేవకు ఆలయంలో టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయంలో ప్రత్యేక పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు పూర్తి చేశా రు. గరుడసేవలో స్వామి వారికి అలంకరించేందుకు తిరుపతి లోని టీటీడీ పరిపాలన భవనం నుంచి గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తిరుమల శ్రీవారి లక్ష్మీ హారాన్ని ఊరేగింపుగా తీసుకువెళతారు.

ఆండాళ్ అమ్మవారి మాలల ఊరేగింపు

తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం నుంచి ఆండాళ్ అమ్మవారి మాలల ఊరేగింపు అదేవిధంగా గురువారం ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతుంది. నగర వీధు ల్లో ఊరేగింపుగా ఉదయం 11 గంటలకు శ్రీనివాస మంగా పురానికి చేరుకుంటాయి.

# ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఫంక్షన్ హాల్, రెస్ట్ రూమ్స్

**ప్రారంభించిన ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే గద్దె**

విజయవాడ(చైతన్యరథం): తూర్పు నియోజకవర్గ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫన్‌టైమ్స్ రోడ్డులోని ఫన్‌టైమ్స్ క్లబ్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాలు, రెస్ట్ రూమ్స్, సోలార్ సిస్ట మ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వాటిని ప్రారంభించారు. ఫన్‌టైమ్స్ క్లబ్‌లో తాము మెంబర్ షిప్ తీసుకుని సభ్యులుగా చేరతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఫన్‌టైమ్స్ క్లబ్ వారు ఎప్పటి నుంచో క్లబ్‌ను నిర్వహిస్తూ మధ్య తరగతి వారు సంతోషంగా కుటుంబసభ్యులతో కలిసి ఉండేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు నూతనంగా ఫంక్షన్‌హాల్ రెస్ట్‌రూమ్స్, సోలార్‌సిస్టమ్స్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నా రు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఇలాంటి ఫ్యామిలి రిక్రియేషన్ క్లబ్స్ నగరంలోని మరిన్ని రావాల్సిన అవసరం



ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ చైర్మన్ బొర్రా గాంధీ, ఫన్ టైమ్ క్లబ్ పాలకవర్గ సభ్యులు కిలారు శివాజీ, సతీష్, సురేష్, విజయ్ బాబు, వెంకటరత్నం, అట్లూరి సుమ బిందు పాల్గొన్నారు.

## వైసీపీ నేతల ఒత్తిడితో

# దొంగలకు కొమ్ముకాసిన పోలీసులు

**చోరీ సొత్తులో బంగారం, వెండి నిందితులకు..**

**ఉద్యోగం పేరుతో కుమార్తెను వేధిస్తున్నారు**

**ఎకరాల భూమిని అడుగులుగా మార్చేశారు**

**ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదు**

**అర్జీలు స్వీకరించిన ప్రతిభాభారతి, పొడపాటి తేజస్వి**

మంగళగిరి(చైతన్యరథం): గత ప్రభుత్వంలో వైసీపీ నేతల ఒత్తిడితో దొంగలకు కొమ్ముకాసిన పోలీసుల నిర్వాకంపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు అందింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన పూర్ణచంద్రరావు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమం లో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. అక్టోబర్ 20, 2021న తమ ఇంట్లో దొంగలు పడి 818 గ్రాముల బంగారం, 15.5 కిలోల వెండి, రూ.50,000 నగదు దోచుకెళ్లారు. కేసు తీవ్రత తగ్గించేం దుకు ఎఫ్ఐఆర్‌లో తక్కువ మొత్తమే రాస్తామని, కానీ మొత్తం రికవరీ చేస్తామని అప్పటి సీఐ మభ్యపెట్టారు. ముగ్గురు దొంగలను పట్టుకుని వారి ద్వారా సత్తెనపల్లిలోని జ్యువెలరీ షాపుల నుంచి సొత్తు రికవరీ చేసినప్పటికీ.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి 500 గ్రాముల బంగారం 30 కిలోల వెండిని పోలీసులు తిరిగి నిందితు లకే అప్పగించారు. గత ప్రభుత్వంలోని ముఖ్య నాయకుల అను చరులు, పీఏల ఫోన్ కాల్స్ వల్ల కేసు ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. పలువురు అధికారులు బదిలీ కావడంతో తనకు అన్యాయం జరిగింది. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు కావలి ప్రతిభా భారతి, ఏపీ కల్చరల్ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజస్వి అర్జీలు స్వీకరించారు.

**కుమార్తెను హింసిస్తున్నారు**

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కురకాల గ్రామానికి చెందిన లక్ష్మి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. 30 ఏళ్లుగా తిరుమల కొండపై పారిశు ధ్య కార్మికురాలిగా పనిచేస్తూ తమ కుమార్తెను చదివించాను. డిగ్రీ పూర్తి చేసి ఉన్నత ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకుంటున్న పెద్ద కుమార్తెను.. ఉద్యోగం ఇప్పిస్తామని, వివాహం జరిపిస్తామని నమ్మించి కొందరు వ్యక్తులు



తీసుకువెళ్లారు. గత రెండు మూడేళ్లుగా తమ కుమార్తెను వారి వద్దే ఉంచుకు ని ఆమెతో అబద్ధాలు చెప్పిస్తూ తనపైనే నిందలు వేసేలా ఒత్తిడి తెస్తున్నారు. ఆమెను భౌతికంగా హింసిస్తూ ఒక వస్తువులా వాడు కుంటూ భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్నారు. న్యాయం కోసం అన్ని కార్యాలయాలు తిరిగినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగ లేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

**భూ రికార్డుల్లో గందరగోళం**

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఒమ్మివరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం.397లో గల 3ఎకరాల 12 సెంట్ల భూమిని రికార్డుల్లో ఎకరాలకు బదులుగా అడుగులలో నమోదు చేశారు. దీనివల్ల భూమి విస్తీర్ణం లెక్కల్లో తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. సదరు భూమిని తన సోదరుడు కొమ్మలపాటి వెంకటే శ్వరరావు కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు ఆయన పేరు మీద ఉన్నప్పటికీ, పాస్ పుస్తకాల జారీలో రికార్డుల నిర్వహణలో గందరగోళం నెలకొంది. ఈ భూమి ఉమ్మడిగా ఉన్నప్పటికీ, రికార్డుల్లో కేవలం అడుగుల లెక్కన ఎక్కించడం వల్ల భవిష్యత్తులో క్రయవిక్రయాలకు లేదా బ్యాంకు రుణాలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**కుమార్తె, అల్లుడు చిత్రహింసలు పెడుతున్నారు**

సత్యసాయి జిల్లా రొద్దం మండలం తురకపట్నం గ్రామానికి చెందిన వెంకటేశులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. పెను కొండ పంచాయతీరాజ్ విభాగంలో రోడ్డు రోలర్ క్లీనర్‌గా పనిచేస్తున్నాను. తనకు ఒకే కుమార్తె తన వృద్ధాప్యంలో తనను తన భార్యను సక్రమంగా చూసుకుంటుందని నమ్మి తన పిత్రార్జిత ఆస్తులైన పొలం, పెనుకొండ అల్విన్ కాలనీలో ఉన్న ఇంటిని తన కుమార్తె పేరున దాన విక్రయ పత్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించా ను. అయితే ఆస్తులు చేతికి వచ్చిన వెంటనే తన కుమార్తె, అల్లుడు తనను నిర్లక్ష్యం చేయడమే కాకుండా కనీస అవసరాలు తీర్చకుం డా చిత్రహింసలకు గురిచేస్తున్నారు. చంపడానికి కూడా ప్రయత్ని స్తున్నారు. ఈ విషయంలో ఇప్పటికే జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ అధికారులకు, కోర్టులో కూడా ఫిర్యాదు చేశాను. తాను బతికి ఉండగానే చనిపోయినట్లుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు తప్పుడు సమాచారం ఇచ్చి ఆస్తులను అన్యాక్రాంతం చేసే ప్రయ త్నం చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని దాన పత్రాలను రద్దు చేయవలసిందిగా కోరారు.

**నిధుల దుర్వినియోగానికి యత్నం**

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కాగుపాడు గ్రామానికి చెందిన కడియాల రవిశంకర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో మాజీ సర్పంచ్ కడియాల సుధేష్ణ హయాంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపిన పంచాయతీ అధికారులు నిజమేనని నిర్ధారించారు. ఈ మేరకు అప్పటి సర్పంచ్, కార్యదర్శుల నుంచి మొత్తం రూ.15,54,244 వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆ మొత్తాన్ని ఇంతవరకు సర్పంచ్, అప్పటి కార్యదర్శులు ప్రభుత్వ ఖజానాకు జమ చేయలేదు. ప్రభుత్వానికి కట్టాల్సిన సొమ్ము చెల్లిం చకుండా పై అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ హైకోర్టులో చెక్ పవర్ కోసం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి రికవరీ ప్రక్రియను పూర్తి చేయకుండానే సర్పంచ్‌కు తిరిగి చెక్ పవర్ కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తక్షణమే రికవరీ మొత్తాన్ని వసూలు చేయాలని కోరాడు.

# ఐదు లక్షల సూక్ష్మ పరిశ్రమల లక్ష్యం

- స్పష్టమైన కార్యాచరణ తయారు చేయాలి
- ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్




విజయవాడ(చైతన్యరథం): ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పోరంకిలోని మురళీ రిసార్ట్‌లో ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్లు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లతో నిర్వహించి న వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో సెర్ప్ ద్వారా పేదల జీవనోపాధుల ప్రోత్సాహం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి సమీక్షించారు.

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక లక్ష మైక్రో ఎంటర్‌ప్రైజెల లక్ష్యాన్ని విజయ వంతంగా సాధించినందుకు ప్రాజెక్ట్ డైరెక్టర్లను మంత్రి అభినందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఐదు లక్షల మైక్రో ఎంటర్‌ప్రైజెల మహత్తర లక్ష్యాన్ని సాధించేందుకు స్పష్టమైన కార్యాచరణాత్మక ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. మైక్రో ఎంటర్‌ప్రైజెల ప్రోత్సాహానికి, బుక్ కీపింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఈ-నారీస్, జీవనోపాధి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల సామర్థ్యాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. అలాగే రైతుల ఆదా యాన్ని పెంపొందించేందుకు సాంకేతిక సంస్థల సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోస్)ను బలోపేతం చేయాలని, ఎఫ్‌పీఓ స్థాయిలో ప్రాసెసింగ్ యూనిట్లు, ఇన్‌పుట్ సెంటర్లు, కస్టమ్ హైరింగ్ సెంటర్లు, కామన్ ఫెసిలిటీ సెంటర్ల స్థాపనను నిర్ధారించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# వంశధారకు గోదావరి జలాలు

- సిక్కోలు సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం
- గవర్నర్ ప్రసంగంతో జిల్లా రైతాంగంలో ఆశలు



శ్రీకాకుళం(చైతన్యరథం): సిక్కోలు సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా జిల్లా రైతాంగం కలలు కంటున్న గోదావరి జలాలను వంశధార నదికి అనుసంధానించే ప్రక్రియకు పచ్చజెండా ఊపింది. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ కీలక ప్రసంగం చేశారు. జిల్లా పేరును నేరుగా ప్రస్తావించక పోయినా.. జిల్లా జీవనాడి అయిన వంశధార ప్రాజెక్ట్, ఉద్దాన రైతాంగం, తీరప్రాంత మత్స్యకారుల సంక్షేమంపై గవర్నర్ చేసిన ప్రకటనలు జిల్లా ముఖచిత్రాన్ని మార్చేలా ఉన్నాయి. దీంతో ఉత్తరాంధ్ర, ముఖ్యంగా జిల్లా అభివృద్ధిపై కొత్త ఆశలు చిగురింపజేశాయి.

**పోలవరం నుంచి వంశధారకు అనుసంధానం**

పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించిన గవర్నర్.. ఆ వెంటనే జిల్లా రైతులకు శుభవార్త చెప్పారు. గోదావరి జలాలను పోలవరం నుంచి వంశధార నదికి అనుసంధానించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు. అదే జరిగితే జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుంది. వర్షాభావ పరిస్థితుల్లోనూ వంశధార ఎండిపోకుండా గోదావరి జలాలు ఆదుకుంటాయి.

**జీడి, మామిడి రైతుల కోసం స్థిరీకరణ నిధి**

జిల్లా ఆర్థిక వనరులైన జీడి, మామిడి రైతుల కోసం ప్రభుత్వం రెండు వేర్వేరు వ్యూహాలను ప్రకటించింది. మార్కెట్లో ధరలు పడి పోయినప్పుడు రైతులు నష్టపోకుండా ఉండేందుకు 'ధరల స్థిరీకరణ' నిధిని మామిడి పంటకు వర్తింపజేస్తామని ప్రకటించా రు. ఏపీఐఐసీ, మార్క్ ఫెడ్ ద్వారా ఈ కొనుగోళ్లు జరుపుతారు. పలాస జీడిపప్పును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా 'వాల్యూ చైన్' ప్రోత్సాహకాలను ప్రకటించారు. 2030 నాటికి జీడిపప్పు ప్రాసెసింగ్, ఎగుమతుల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని వెల్లడించారు.

**మత్స్యకారుల కోసం..**

జిల్లాలోని సుదీర్ఘ తీరప్రాంతాన్ని ఉపయోగించుకుని మత్స్యకా రుల జీవితాల్లో వెలుగులు నింపేలా వరాలు కురిపించారు. సము ద్రపు కలుపు మొక్కల పెంపకం ద్వారా తీరప్రాంత మహిళా సంఘాలకు కొత్త ఆదాయ మార్గాలను చూపనున్నారు. వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ.20 వేల వరకు పెంచారు. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుల ఏర్పాటు, ఓడరేవుల ఆధారిత ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఇది జిల్లాలో నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టు పరిసరాల అభివృద్ధికి సూచిక. గిరిజన ప్రాంతా ల్లో పండించే పంటలకు (పసుపు, అనాస వంటివి) అక్కడే విలువ జోడించే కార్యక్రమాలు చేపడతామని చెప్పడం ద్వారా సీతంపేట ఐటీడీఏ పరిధిలోని రైతులకు మేలు జరుగుతుంది.

**జిల్లాకు దక్కిన సూపర్ 'సిక్స్'**

*వంశధార - గోదావరి అనుసంధానం (సాగునీటి భద్రత)*
*మామిడికి ధరల స్థిరీకరణ (గిట్టుబాటు ధర)*
*జీడిపప్పుకు ఎగుమతి ప్రోత్సాహకాలు (పారిశ్రామిక ప్రగతి)*
*మత్స్యకార భృతి రూ. 20 వేలకు పెంపు (సంక్షేమం)*
*సీవీడ్ సాగుతో మహిళలకు ఉపాధి (సాధికారిత)*
*గిరిజన ఉత్పత్తులకు వేల్యూ అడిషన్ (మన్యం అభివృద్ధి)*

## 11 మంది ఎమ్మెల్యేలతో 11 నిమిషాల డ్రామా

- పదువులు పోతాయనే భయంతోనే అసెంబ్లీకి
- ప్రజా సమస్యలపై ఒక్క మాట కూడా లేదు
- వైసీపీ, జగన్‌పై ఎంపీ కేశినేని శివనాథ్ ధ్వజం



*విజయవాడ(చైతన్యరథం): గత ఏడాదిన్న కాలంలో అసెంబ్లీకి రాకుండా ఉన్న పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు తమ పదవులు పోతాయనే భయంతోనే అసెంబ్లీకి వచ్చారు.. గత ఏడాదిన్నర కాలంగా తన 11 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి రాకుండా దుమ్ము కొడుతున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. బుధవారం ఎంపీకేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ కాలేజ్, స్కూల్‌కు విద్యార్థులు హాజరు కాకపోతే చర్యలు ఎలా ఉంటాయో...అదే విధంగా అసెంబ్లీకి హాజరుకాకపోతే ఎమ్మెల్యే పదవులు కోల్పోయే పరిస్థితి ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు హెచ్చరించిన తర్వాతే పులివెందుల ఎమ్మెల్యే అసెంబ్లీకి వచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పదవులు పోతాయనే భయంతో 11 మంది ఎమ్మెల్యేలను వెంట తీసుకొచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా కేవలం 11 నిమిషాలు మాత్రమే సభలో గడిపి బయటకు వెళ్లడం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. 11 మంది ఎమ్మెల్యేలతో 11 నిమిషాలు గడిపిన జగన్‌కు రాబోయే రోజుల్లో పులివెందుల్లో కూడా పరాజయం తప్పదని హెచ్చరించారు. బుద్ధి తెచ్చుకుని అసెంబ్లీకి క్రమం తప్పకుండా హాజరై ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.*

# గవర్నర్ ప్రసంగంలో ఇండస్ట్రియల్ కారిడార్

**ఓర్వకల్లు వద్ద జైరాజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమ**

**సీమ ప్రగతికి పారిశ్రామిక క్లస్టర్ ఊతం**

కర్నూలు(చైతన్యరథం): పెట్టుబడులు రాబట్టాలి.. యువతరా నికి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి.. తద్వారా రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించాలి.. పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం కావాలి.. ఇది ముఖ్యమంత్రి చంద్రబా బు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ సంకల్పం. బుధవారం అసెం బ్లీలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తూ పారిశ్రామిక పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు, సెక్టోరల్ క్లస్టర్లు.. వంటి బలమైన వ్యవస్థ ద్వారా పారిశ్రామిక మౌళిక సదుపాయాలు విస్తరిస్తున్నా యని స్పష్టం చేశారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బడ్జెట్-2024-25 ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఓర్వ కల్లు పారిశ్రామిక నోడ్‌పై కీలక ప్రకటన చేశారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పనకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడిభాగాల తయారీ, పునరు త్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరిక రాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మా స్యూటికల్స్, వజ్రాలు, బంగారు అభరణాల తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ప్రత్యేక దృష్టిని పెట్టిందని, ఈ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు.



**ఓర్వకల్లు కేంద్రంగా వస్తున్న పరిశ్రమలు**

ఓర్వకల్లు మండలం గుమ్మటంతండా, నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ 4,766.28 ఎకరాలో 5,230 మెగావాట్ల పవర్ ఉత్పత్తి సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టు (ఐఆర్ఈఎస్‌పీ) నిర్మాణం పూర్తయ్యింది. ప్రాజెక్టు ప్రారంభానికి సన్నహాలు చేస్తున్నారు. ఇది దేశంలోనే తొలి ప్రాజెక్టు. 1,680 మెగావాట్లు స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టు (పీఎస్‌హెచ్‌పీ), 3 వేల మెగావాట్లు సోలార్, 550 మెగావాట్లు విండ్ పవర్ ఉత్పత్తి చేస్తారు. ఒకే చోట మూడు రకాల విద్యుత్ ఉత్పత్తి చేసి, నిల్వ చేసే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు.

ఓర్వకల్లు సమీపంలో 415 ఎకరాల విస్తీరణంలో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమకు 2017లో ఆనాటి సీఎం చంద్రబాబు పునాదిరాయి వేశారు. దాదాపు రూ.3 వేల కోట్లు పెట్టుబడితో ఈ పరిశ్రమను ప్రారంభించారు. 0.45 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం. వంద శాతం పనులు పూర్తి చేసుకొని ట్రైల్‌రన్ ఉత్పత్తిని కూడా చేపట్టింది.

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ కారిడార్‌లో రూ.22,976 కోట్ల పెట్టుబడి అంచనాతో స్థాపించే సెమీ కండక్టర్స్ యూనిట్‌కు రాయితీపై 150 ఎకరాలు కేటాయించారు. ఈ పరిశ్రమ ద్వారా 1,241 మందికి ఉద్యోగాలు వస్తాయని అంచనా.

ఓర్వకల్లు కేంద్రంగా డ్రోన్ అండ్ రోబోటిక్ డ్రోన్ సిటీ ఏర్పాటు చేయనున్నారు.

సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.1,090 కోట్లతో అంచనాతో వంద ఎకరాల్లో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సంస్థ ద్వారా 1,200 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుంది.

రిలయన్స్ సంస్థ రూ.1,622 కోట్లతో పెట్టుబడితో శీతలపానీయాలు, జ్యూస్, తాగునీరు తయారీ పరిశ్రమ స్థాపనకు దాదాపు సన్నాహాలు పూర్తయ్యాయి. 80 ఎకరాల భూమిని కూడా కేటాయించారు. 1,200 మందికి ప్రత్యేక్షంగా ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్‌లో భాగంగా 1,150 మందికి ఉపాధి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంగా రూ.291 కోట్లతో జైన్ ఫార్మ ఫ్రెష్‌ఫుడ్ లిమిటెడ్, 400 మందికి ఉపాధి కల్పించేందుకు రూ.300 కోట్లతో జయాదిత్య ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్, 250 మందికి ఉపాధి కల్పించేలా రూ.45 కోట్లతో ఫ్రెష్‌బో హార్టికల్చర్ పరిశ్రమ, 25 మందికి ఉపాధి కల్పించేలా రూ.10 కోట్లతో శ్రీమిత్ర ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ప్రభుత్వంలో ఎంఓయూ చేసుకున్నాయి.

# అట్లాంటా నా సెకండ్ హోమ్

## గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### గేమ్ అండ్ గ్రిల్ ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీ సందర్శన





అట్లాంటా: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమెరికా పర్యటనలో ఉన్నారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా అట్లాంటా విచ్చేసిన ఆయన స్థానిక ఆల్ఫారెటాలో ఉన్న గేమ్ అండ్ గ్రిల్ ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీని సందర్శించారు. ఆయనకు అకాడమీ యాజమాన్యం సాదర స్వాగతం పలికింది. అనంతరం ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీ అంతటా కలియతిరిగారు. అక్కడ ట్రైనింగ్ ఇస్తున్న బ్యాడ్మింటన్, పికిల్ బాల్ ఆటలకి ఏర్పాటుచేసిన కోర్టులను పరిశీలించి కోచ్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీలో అమెరికా స్థాయిలో నిర్వహిస్తున్న టౌర్నమెంటుల వివరాలను నిర్వాహకులు రాముతో పంచుకున్నారు. రాము తన అట్లాంటా స్నేహితులు స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్‌తో నిర్మించిన ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీలో సరదాగా కాసేపు బాడ్మింటన్ గేమ్ ఆడడం విశేషం.

ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడ తన మొదటి ఇల్లు అయితే, అట్లాంటా తన సెకండ్ హోమ్ అన్నారు. స్నేహితులను కలవడం, వారు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీని నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు.

ప్రస్తుత కాలంలో స్పోర్ట్స్ ఆడుతూ ఫిట్నెస్ మైయింటైన్ చేయడం చాలా అవసరమన్నారు. స్పోర్ట్స్ అంటే తనకు కూడా చాలా ఇష్టమని, అందుకే గుడివాడలో కూడా స్పోర్ట్స్‌కి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గుడివాడలో ఉంటే అలసిపోవడం ఉండదని, అక్కడి ప్రజలతో మమేకమవడం, వారి సాధకబాధకాలు తెలుసుకుని చేయగలిగినంత సహాయం చేస్తున్నానన్నారు.

మహా న్యూస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మారెళ్ల వంశీతో తనకు చక్కని అనుబంధం ఉందని, ఆయన విజన్ చాలా గొప్పదని, ప్రతి కార్యక్రమంలోనూ ఎప్పుడూ కలుస్తూ ఉంటామని రాము అన్నారు. గేమ్ అండ్ గ్రిల్ ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో అంజయ్య చౌదరి లావు, సతీష్ పూనాటి, శ్యామ్ మల్లవరపు, శ్రీకాంత్ ఉప్పల, కిరణ్ గోగినేని, విజయ్ కొత్త, రమేష్ గుడే, విష్ణు వైదన, భాను, శ్రీధర్ కొర్రపాటి తదితరులు పాల్గొన్నారు.





# చెత్త నుంచి సంపద సృష్టి

ఆస్ట్రేలియాలో దేశంలో కంటైనర్ డిపాజిట్ పథకాలు (ఎన్ఎస్‌డబ్ల్యులో రిటర్న్ అండ్ ఎర్న్, క్వీన్స్‌ల్యాండ్‌లో కంటైనర్స్ ఫర్ చేంజ్ లేదా విక్టోరియాలో సీడీఎస్ వంటివి) కింద ప్రజలు నియమించబడిన పాయింట్ల వద్ద లేదా రివర్స్ వెండింగ్ మెషీన్లలో తిరిగి ఇచ్చే అర్హత కలిగిన ప్రతి ప్లాస్టిక్ బాటిల్, డబ్బా లేదా గాజు కంటైనర్‌కు 10 సెంట్లు సంపాదిస్తారు. ఇది చెత్తను తగ్గించడానికి మరియు రీసైక్లింగ్ రేట్లను పెంచడానికి సహాయపడుతుంది. ఇటీవలి వైరల్ కథనం ఒక యువతి (లేదా కొన్నిసార్లు ఇలాంటి కుటుంబం/అమ్మ క్లిప్‌లలో ప్రస్తావించబడింది) వీధులు, పార్కులు లేదా డబ్బాల నుంచి వ్యర్థ ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి వాటిని నగదుగా చేసుకుని \$25 సంపాదించింది. అంటే ఆమె దాదాపు 250 బాటిళ్లను తిరిగి ఇచ్చింది ($250 \times \$0.10 = \$25$ నుండి). పిల్లలు మరియు కుటుంబాలతో సహా రోజువారీ ప్రజలు పర్యావరణ ప్రయత్నాన్ని పాకెట్ మనీగా ఎలా మారుస్తారో ఈ నిరాడంబరమైన రవాణా చూపిస్తుంది. చాలా మంది ఆస్ట్రేలియన్లు ఇలాంటి చిన్న బ్యాచ్‌లను ట్రిప్‌కు \$20–\$25 దిగుబడిని ఇస్తున్నట్లు నివేదిస్తున్నారు (తల్లులు స్థిరంగా సేకరించడం ద్వారా కాలక్రమేణా వందల లేదా వేల సంపాదిస్తున్న కథలలో చూడవచ్చు). రాష్ట్రాల వారీగా స్వల్ప వ్యత్యాసాలతో దేశవ్యాప్తంగా చురుకుగా ఉన్న ఈ పథకం, అటువంటి చొరవలను ప్రోత్సహిస్తుంది. పర్యావరణాన్ని శుభ్రపరిచేటప్పుడు

అదనపు నగదు కోసం లెక్కలేనన్ని సైడ్ హస్టిల్‌లను ప్రేరేపించింది.

# వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

## అంతర్జాతీయ 31వ ఉగాది ఉత్తమ రచనల పోటీలు

అమెరికా: మూడు దశాబ్దాల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది (మార్చి 19) సందర్భాన్ని పురస్కరించుకుని వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 31వ అంతర్జాతీయ ఉగాది ఉత్తమ రచనల పోటీ నిర్వహిస్తోంది. భారతదేశం సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు రచయితల నుంచి అముద్రిత నూతన రచనలను ఆహ్వానిస్తోంది.

### పోటీ విభాగాలు, బహుమతుల వివరాలు:

ప్రధాన విభాగం – ప్రపంచ రచనల పోటీ
ఉత్తమ కథానిక: రెండు సమాన బహుమతులు (ఒక్కొక్కటి 200 యూఎస్ డాలర్లు)
ఉత్తమ కవిత: రెండు సమాన బహుమతులు (ఒక్కొక్కటి 200 యూఎస్ డాలర్లు)
మొట్టమొదటి రచనా విభాగం (19వసారి నిర్వహణ): కొత్త రచయితలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఈ విభాగంలో...
నా మొట్టమొదటి కథ: ఉత్తమ కథకు 116 యూఎస్ డాలర్లు
నా మొట్టమొదటి కవిత: ఉత్తమ కవితకు 116 యూఎస్ డాలర్లు
(గమనిక: ఇవి తమ మొట్టమొదటి అముద్రిత స్వీయ రచన అని హామీ పత్రం సమర్పించాలి).
యువతరం విభాగం (5వసారి నిర్వహణ): 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల యువతీ, యువకుల కోసం.
ఉత్తమ కథానిక: రెండు సమాన బహుమతులు (ఒక్కొక్కటి 116 యూఎస్ డాలర్లు)
ఉత్తమ కవిత: రెండు సమాన బహుమతులు (ఒక్కొక్కట 116 యూఎస్ డాలర్లు) (వయసు ధ్రువీకరణ పత్రం జిరాక్స్ జతపరచాలి).

ముఖ్య నిబంధనలు:
రచనల స్వభావం: కేవలం అముద్రిత స్వీయ రచనలు మాత్రమే స్వీకరిస్తారు. సొంత బ్లాగులు, వెబ్‌సైట్లలో ప్రచురించుకున్నవి పరిగణించరు. హామీ పత్రం తప్పనిసరి.
ఫార్మాట్: రచనలు కేవలం యూనికోడ్ (ఉదా: గౌతమి ఫాంట్)లో మాత్రమే ఉండాలి. పీడీఎఫ్ లేదా జేపీజీ ఫార్మాట్లు కూడా ఆమోదయోగ్యమే. చేతి రాతతో పంపిన వాటిని స్వీకరించరు.
నిడివి: కథానికలు 2500 పదాలలోపు (సుమారు 15 పేజీలు), కవితలు 5 పేజీలలోపు ఉండాలి.
పరిమితి: ఒక రచయిత ఒక్కో ప్రక్రియకు (కథ/కవిత) ఒక రచన మాత్రమే పంపాలి. అయితే అర్హత ఉన్న అన్ని విభాగాలల్లోనూ పాల్గొనవచ్చు. ఇతివృత్తం రచయిత ఇష్టం.
ప్రచురణ: బహుమతి పొందిన, అర్హత ఉన్న రచనలు కౌముది.నెట్ వంటి పత్రికలలో సంపాదకుల నిర్ణయానుకనుగుణంగా ప్రచురితమవుతాయి. మార్చి 19 లోపు వీటిని వేరే ఎక్కడా ప్రచురించకూడదు.
రచనలు అందవలసిన ఆఖరి తేదీ: ఫిబ్రవరి 19, 2026
విజేతల ప్రకటన: మార్చి 19, 2026 (ఉగాది నాడు లేదా అంతకు ముందు)
సమర్పణ విధానం: కేవలం గూగుల్ ఫామ్ ద్వారా మాత్రమే పంపాలి.
వివరాల కోసం: శాయి రాచకొండ (1 281 235 6641), దీప్తి పెండ్యాల (1 513 827 7790), వంగూరి చిట్టెన్‌రాజు (1 832 594 9054)లను లేదా vangurifoundation@gmail.comని సంప్రదించవచ్చు. నిర్వాహకుల నిర్ణయమే తుది నిర్ణయమని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# అగ్నిమాపక సేవల ఆధునీకరణకు రూ.5 వేల కోట్లు

**- ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



ఏలూరు/ఢిల్లీ, : రాష్ట్రాలలో అగ్నిమాపక సేవల విస్తరణ, ఆధునికరణ అవసరాన్ని గుర్తించి 15వ ఆర్థిక సంఘం 5 వేల కోట్ల కేటాయింపులకు సిఫార్సు చేసినట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ వెల్లడించారు. దేశంలో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణకు ఏర్పరచిన అగ్నిమాపక భద్రత నిబంధనలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు మంగళవారం లోక్ సభలో కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన వివరాల ప్రకారం నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అండ్ (NCRB) రూపొందించిన డేటా ప్రకారం 2023 ఒక్క ఏడాదిలోనే హైదరాబాదులోనే దేశంలో మొత్తం 7,054 అగ్నిప్రమాదాలు నమోదవ్వగా 6,891 మంది మరణించారు, 284 మంది గాయపడ్డారు. అయితే, అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతాచార్యలు అనేవి పూర్తిగా రాష్ట్రాలకు సంబంధించిన అంశం అని, విధానపరమైన విషయాలలో సలహాలు, మద్దతు ఇవ్వడం వరకే కేంద్ర ప్రభుత్వం పాత్ర పోషిస్తుందని అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తుగా తీసుకుంటున్న చర్యలు, ముఖ్యంగా ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలు, పారిశ్రామిక యూనిట్లలో అగ్నిమాపక భద్రత నిబంధనలపై జరిగిన సమీక్ష వివరాలు కోరుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రత్యేకంగా అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి వివరంగా సమాధానం ఇచ్చారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ 2016లో "నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా (NBC)"ని ప్రచురించిందని చెప్పిన మంత్రి ఇందులో భవనాలలో పొగ నిర్వహణ, విద్యుత్తు, అగ్ని ప్రమాద నివారణ సామగ్రి, భవన నిర్వహణ వ్యవస్థ, సెన్సార్లకు సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రక్షణ కోసం నిబంధనలను ప్రమాణాలను స్పష్టంగా ఇందులో సూచించినట్లు తెలిపారు. అంతేకాకుండా నాగపూర్ లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్ (NFSC)లో సబ్ ఫైర్ ఆఫీసర్లు, స్టేషన్ ఆఫీసర్లు, డివిజనల్ ఆఫీసర్లకు అగ్నిమాపక రక్షణలో ఆధునిక పద్ధతులపై క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. నాగపూర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఫైర్ ఇంజనీరింగ్ సైన్స్‌లో నాలుగు సంవత్సరాల బీటెక్ డిగ్రీ ప్రోగ్రాం కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత ఐదు సంవత్సరాల్లో NFSC నాగపూర్ లో మొత్తం 4,049 ఫైర్ సర్వీస్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు, 329 బిటెక్ ఇంజనీర్లు ఇక్కడినుంచి తయారైనట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అగ్నిమాపక సేవలు విస్తరణ మరియు ఆధునికరణ కోసం ఒక పథకాన్ని కూడా ప్రారంభించినట్లు చెప్పిన కేంద్ర మంత్రి ఈ పథకంలో కొత్త అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు, రాష్ట్ర శిక్షణా కేంద్రాల బలోపేతం, అగ్నిమాపక కేంద్రాలలో సాంకేతికత అప్ గ్రేడ్ చేయడం వంటి అంశాలు ఉన్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు కేంద్ర మంత్రి తెలియచేశారు.

# గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు

**స్త్రీశిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**




*అమరావతి(చైతన్యరథం): సచివాలయంలో 114వ ఏపీ గిరిజన సలహా మండలి సమావేశం గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధ్యక్షతన బుధవారం జరిగింది. గిరిజనుల విద్య, వైద్యం, ఉద్యోగ ఉపాధి, భూ హక్కు లపై సమగ్ర చర్చ జరిగింది. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, రోడ్లు పనులపై సమీక్షించారు. గిరిజన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభు త్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.*

# సురగాల ఉమా ఖబర్దార్

- **నీకు మతి భ్రమించింది.. నీ లెక్కలు తేలుస్తాం..**
- **మా ఎమ్మెల్యేను విమర్శించే అర్హత నీకు లేదు**
- **నువ్వు చేసే అరాచకాలను ఆధారాలతో బయటపెడతాం**
- **నువ్వు ఏ పార్టీలో ఉన్నావో నీకే తెలియదు**
- **విలేకరుల సమావేశంలో ఆగ్రహించిన కూటమి శ్రేణులు**




పార్వతీపురం, (చైతన్యరథం): సురగాల ఉమా ఖబర్దార్...నీ లెక్కలు తేలుస్తాం.. మా ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను విమర్శించే అర్హత నీకు లేదు.. నువ్వు చేసిన అరాచకాలను బయట పెడతాం అని టిడిపి శ్రేణులు హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సురగాల నువ్వు చేసే అరాచకాలను ఆధారాలతో బయటపెడతామని, అసలు నువ్వు ఏ పార్టీలో ఉన్నావో నీకే తెలియదని, నీకు మతి భ్రమించి ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి పాలనలో పూర్తిగా నియోజకవర్గ అభివృద్ధి మూలన పడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పూర్తిస్థాయి అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందిన ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అని, దిక్కుముక్కు లేని అనామక వ్యక్తి అయిన సురగాల ఉమా ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని, నోరు మూసుకొని ఓ మూలన పడి ఉంటే బాగుంటుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పార్వతీపురం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయి అభివృద్ధి చేయడానికి ఒక కంకణం కట్టుకున్నారని, ఆయన అడుగుజాడల్లో మేమంతా నడుచుకొని అభివృద్ధి బాటలు వేస్తున్నామని అన్నారు. సురగాల ఉమా అనే వ్యక్తి బీజేపీ పార్టీలో ఏదో రాష్ట్రస్థాయి పదవి ఉందని చెప్పి పార్వతీపురం ప్రాంతంలో అనేక ప్రభుత్వ స్థలాలు, పేదల ఇళ్ల స్థలాలు, భూములు ఆక్రమణ చేశారని, వాటి ఆధారాలతో సహా మేము బయటపెట్టి కటకటాల వెనక్కి తీసుకువెళ్తామని హెచ్చరించారు. ఒక కార్యకర్త హోదాకి కూడా పనికిరాని ఉమా అభివృద్ధి బాటలో నియోజకవర్గాన్ని నడిపిస్తున్న ఎమ్మెల్యేను విమర్శించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవడాన్ని చూసి అడ్డుకున్న ఎమ్మెల్యే పై ఈ సురగాల ఉమా అలియాస్ సుడిగాలి ఉమా ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం అని, అసలు ఆ స్థల కబ్జాదారుడు ఈ సుడిగాలి ఉమాకు ఎంత ముట్ట చెప్పారని ప్రశ్నించారు. ప్రజలు అందజేసే ప్రతి ఫిర్యాదును ఎమ్మెల్యే పరిష్కరించడానికి కృషి చేస్తున్నారని అలా పరిష్కరిస్తూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని సమస్యలు పార్వతీపురం మున్సిపాలిటీలోని అన్ని వార్డుల సమస్యలను పరిష్కారం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే కల్వర్టుపై అక్రమ నిర్మాణాలు చేస్తే మా ఎమ్మెల్యే తో పాటు మేము కూడా చూస్తూ ఊరుకోమని, ఈ విషయంపై ఎంతవరకు వెళ్లాలో అంతవరకు వెళ్తామని, ఇటువంటి సురగాల ఉమాలు 1000 మంది వచ్చినా ఈ అక్రమ నిర్మాణాలను వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఒక వార్డు సభ్యుడికి కూడా అర్హత లేని సూరగాల ఉమా.. నువ్వు మా ఎమ్మెల్యేని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. నువ్వు భూమి లాక్కున్న వ్యక్తి ఇటీవలే ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ విషయంపై మా ఎమ్మెల్యే కన్నెర్ర చేస్తే నువ్వు జైల్లో ఉంటావని అన్నారు. నీ పని నువ్వు చేయకుండా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పై లేనిపోని ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని, ఇకనైనా ఇటువంటి ఆరోపణలు మానుకొని ఓ మూల కూర్చొని ఉండాలని హితవుపలికారు. ఈ సమావేశంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోను దేవి చంద్రమౌళి, టిడిపి యువ నాయకులు 8వ వార్డు కౌన్సిల్ సభ్యులు కోరాడ నారాయణరావు, టిడిపి సీనియర్ నాయకులు జాగాన రవిశంకర్, పాలకొండ రాజశేఖర్, పలువురు కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, టిడిపి మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో 5వ సిట్టింగ్ పారా వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



విశాఖ (చైతన్యరథం): విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం, గోపాలపట్నం 92వ వార్డు, గోపాలపట్నం జట్పీహెచ్ స్కూల్ ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి 5వ సిట్టింగ్ పారా వాలీబాల్ టోర్నమెంట్ (బాయ్స్ & గర్ల్స్) ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా వాలీబాల్‌లో ప్రతిభ చూపిన యువకులు, యువతులు ఈ ప్రత్యేక క్రీడా మైదానంలో పాల్గొన్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో పంచకర్ల రమేష్ బాబు, పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు, మరియు జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కర రావు ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రీడలు కేవలం శరీర దారుఢ్యాన్ని మాత్రమే పెంపొందించకపోవడంతోపాటు, మానసిక శక్తి, జ్ఞాపకశక్తి మరియు సామూహిక చైతన్యాన్ని కూడా ప్రేరేపిస్తాయని వివరించారు.

అతిథులు మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ ప్రారంభంలో జ్యోతి ప్రదీపం ఆరంభించడం ద్వారా క్రీడాకారులకు స్ఫూర్తి నింపబడి, వారి ప్రతిభను ప్రదర్శించే ఉత్తమ వేదికగా మారిందని తెలిపారు. ప్రతి క్రీడాకారుడు తన ప్రతిభతో పతకాలు గెలిచి, జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో మంచి పేరు తెచ్చుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

ఈ టోర్నమెంట్ ద్వారా స్థానిక విద్యార్థులు క్రీడా రంగంలో ప్రావీణ్యం సాధించడమే కాక, క్రీడా ఆచారాలపై అవగాహన పెరుగుతుందని అధికారులు తెలిపారు. అలాగే, క్రీడా కార్యక్రమాల ద్వారా యువతకు సమూహంలో పనిచేయడం, ధైర్యం, మానసిక స్థిరత్వం వంటి నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నది ముఖ్యాంశం.

రాష్ట్ర స్థాయి పారా వాలీబాల్ టోర్నమెంట్ యువతలో క్రీడా పట్ల ఆసక్తిని మరింతగా పెంచుతూ, గోపాలపట్నం ప్రాంతాన్ని క్రీడా పరంగా గుర్తింపు పొందే ప్రాంతంగా మలచేలా వుంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బి. శివదత్, కార్యదర్శి సి. హెచ్. గణేష్, డి. స్వరూప్, జె. ఎన్. సంతోషి రావు, రాపర్తి అప్పారావు, అట్టా శంకర్, రమణ, బలిరెడ్డి శ్రీను, షేక్. వల్లి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వారు క్రీడాకారులను ప్రోత్సహించి, వారి క్రీడా ప్రవర్తనకు ప్రశంసలు తెలిపారు.

# సాధువులపై భూమన అనుచిత వ్యాఖ్యలు

**- శ్రీనివాసానంద సరస్వతి ఆగ్రహం**



విశాఖపట్నం (చైతన్యరథం): సాధువులపై వైసీపీ నేత భూమన కరుణాకర రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ నేత భూమన తన పార్టీ అజెండాను బయటపెట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సత్యనిష్ఠతో మాట్లాడిన శ్రీనివాసానంద సరస్వతి, "సాధువులపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. మాకు కుటుంబం లేదు. మాకు సమాజమే కుటుంబం. మా వద్ద కోట్ల రూపాయలు ఉండాల్సిన అవసరం లేదు. దేవుడు ఇచ్చిన సంపదతో జీవించిపోతున్నాం. ప్రాణాలు పోయినా వేంకటేశ్వరస్వామి కోసం పోరాడతాం. తప్పు జరిగిందని గుర్తించిన మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇప్పటికే అంగీకరిస్తున్నందున, భూమన కరుణాకర రెడ్డి క్షమాపణ చెప్పాలి" అని పేర్కొన్నారు. అంతేకాక, ఆయన హిందూ సంఘాల ప్రతినిధులు మౌనంగా ఉండటంతో వైకాపా నేతలు మరింత రెచ్చిపోతున్నారని, దానిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనను వ్యతిరేకిస్తూ, సాధు పరిషత్ విస్తృత చింతనతో భూమన వ్యాఖ్యలను నిరసిస్తున్నట్లు శ్రీనివాసానంద సరస్వతి తెలిపారు.

# పదువులు పోతాయనే భయంతోనే అసెంబ్లీకి వచ్చారు

● పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డిపై ఎంపీ కేశినేని శివనాథ్ మండిపాటు

● 11 మంది ఎమ్మెల్యేలతో 11 నిమిషాల డ్రామా, ప్రజా సమస్యలపై లేని పోరాటం



విజయవాడ (చైతన్యరథం): గత ఏడాదిన్న కాలంలో అసెంబ్లీకి రాకుండా వున్న పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు తమ పదవులు పోతాయనే భయంతోనే అసెంబ్లీకి రావటం జరిగింది. వై.ఎస్.జగన్ కాలేజీకి వెళ్లిన దాఖలు లేవు... అదే విధంగా గత ఏడాదిన్నర కాలంగా తన 11 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి రాకుండా దుమ్ము కొడుతున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ విమర్శించారు. బుధవారం ఎంపీకేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ కాలేజీ, స్కూల్‌కు విద్యార్థులు హాజరు కాకపోతే చర్యలు ఎలా వుంటాయో... అదే విధంగా అసెంబ్లీకి హాజరు కాకపోతే ఎమ్మెల్యే పదవులు కోల్పోయే పరిస్థితి ఉందని స్పీకర్ అయ్యన్న పాత్రుడు , డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు హెచ్చరించిన తర్వాతే పులివెందుల ఎమ్మెల్యే అసెంబ్లీకి వచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పదవులు పోతాయనే భయంతో 11 మంది ఎమ్మెల్యేలను వెంట తీసుకొచ్చి, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా కేవలం 11 నిమిషాలు మాత్రమే సభలో గడిపి బయటకు వెళ్లడం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. ఒక షికారు యాత్రలా వచ్చి అసెంబ్లీని డ్రామాలకు వేదికగా మార్చడం దురదృష్టకరమని అన్నారు. ఇటువంటి ప్రవర్తన కారణంగానే రాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఈ వేషాలు చూస్తే ఆ 11 సీట్లు కూడా అవసరం లేదని ప్రజలు భావిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజలంతా ఆనందంగా ఉన్నారని తెలిపారు.

# ప్రారంభమైన నగరవనం నిర్మాణం

● చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ చొరవతో ప్రారంభమైన మరో ప్రాజెక్ట్



చింతలపూడి (చైతన్యరథం): చింతలపూడి పట్టణానికి సమీపంలో పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలకు వినోదాన్ని అందించేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా నగరవనం నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పట్టణ శివారు ఫాతిమాపురంలో ఏర్పాటు చేసే నగరవనంలో చేపట్టవలసిన పనులను మంగళవారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ డీఎఫ్‌వో సందీప్‌రెడ్డితో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్చించారు. నగరవనం స్వాగత ద్వారం ఏర్పాటు ఆకర్షణీయంగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని శాసనసభ్యులు సూచించారు. నగరవనం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెద్దలకు, పిల్లలకు వినోదంగా ఉండేలా ఏర్పాటు చేయాలని రోషన్ కుమార్ పేర్కొన్నారు. అందర్నీ ఆకర్షించే విధంగా వర్చువల్ జంగల్ సఫారీ, ప్రకృతి శోభను ప్రతిబింబించే విధంగా ఏర్పాట్లు, సందర్శకులకు అనువైన క్రికెట్ టర్ఫ్, క్రీడ మైదానం క్యాంటీన్ వంటి వసతి సౌకర్యాలు కల్పించి రాష్ట్రంలో వినూత్న రీతిలో రూపొందించాలని సూచించారు.

# వాట్సప్ గవర్నెన్స్ ద్వారా వేగంగా మెరుగైన సేవలు

● వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

● సైబర్ సెక్యూరిటీ ద్వారా సమర్థవంతమైన సేవలు : ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వెల్లడి



గుంటూరు (చైతన్యరథం): ప్రజలు తమకు కావాల్సిన ప్రభుత్వ సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అరచేతిలోని సెల్‌ఫోన్ ద్వారా పలురకాల పౌరసేవలు పొందేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. బుధవారం గుంటూరులోని ఆర్‌వీఆర్అండ్‌జేసీ కళాశాలలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విన్నూత్న ఆలోచనతో భారతదేశంలోనే తొలిసారిగా ప్రజలకు వాట్సాప్‌లోనే 920కి పైగా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ 'మన మిత్ర' అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రజలు తమ మొబైల్‌లో 95523 00009 నంబర్‌ను సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో 'హాయ్' అని మెసేజ్ పంపిస్తే మనకు ఎటువంటి సేవలు కావాలో ఎంచుకునే వీలుందన్నారు. మన మిత్ర యాప్ ద్వారా విద్యార్థులు వారి హాల్ టికెట్లు, తల్లికి వందనం అప్‌డేట్స్‌తో పాటుగా వివిధ ప్రభుత్వ సర్టిఫికెట్లు పొందవచ్చునన్నారు. తిరుమలతోపాటు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో దర్శనం, వసతి వంటి వాటిని నేరుగా వినియోగదారుడే బుక్ చేసుకోవచ్చునని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఆర్టీసీ బస్ టికెట్లు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, పెన్షన్ ఇలా అనేక సేవలు పొందవచ్చునని తెలిపారు.

**హ్యాకర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి... 1930కి కాల్ చేయండి**

ప్రభుత్వ విభాగాలకు మరింత సమర్థవంతమైన సైబర్ సెక్యూరిటీ సేవలను అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్‌ను స్థాపించారని, అత్యాధునిక టెక్నాలజీతో ఇది భారతదేశంలోనే బెస్ట్ సైబర్ సెక్యూరిటీ మానిటరింగ్ సెంటర్‌గా నిలుస్తుందన్నారు. సైబర్ సెక్యూరిటీలో భాగంగా ప్రతి ఒక్కరూ మొబైల్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత డేటాను తస్కరించేందుకు హ్యాకర్ల ప్రయత్నం చేస్తుంటారని ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ గేమింగ్, లోన్ యాప్స్ పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో ఉచితంగా దొరికే వైఫై సేవలు అధికంగా వినియోగించడం, అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చే లింకులను క్లిక్ చేయొద్దని ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు మన్నవ మోహనకృష్ణ సూచించారు. ఆన్‌లైన్ మోసగాళ్ల చేతిలో డబ్బులు పోగొట్టుకున్నా లేదా సైబర్ వేధింపులకు గురైనా సమాచారాన్ని సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్‌కు తెలియజేయాలన్నారు.

# క్యాన్సర్ రోగులకు పెమ్మసాని చేదోడు

● గుంటూరు, కడపలో ఆధునిక క్యాన్సర్ చికిత్సకు కేంద్ర సహాయం

● ఓఎన్‌జీసీ సిఎస్ఆర్‌తో రెండు లైనాక్ యంత్రాలు మంజూరు



ఢిల్లీ / గుంటూరు (చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గుంటూరు మరియు కడప ప్రభుత్వ ఆసుపత్రులకు ఆధునిక క్యాన్సర్ చికిత్సల నిమిత్తం రెండు మిషన్లను అందజేస్తున్నామని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలిసి, ఓఎన్‌జీసీ సంస్థ అందించిన విశిష్ట సిఎస్ఆర్ మద్దతుకు కేంద్ర సహాయ మంత్రి ఎమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన స్క్రీనింగ్‌లో లక్షలాది మందికి పైగా మందిని పరీక్షించగా 22,888 అనుమానాస్పద క్యాన్సర్ కేసులు గుర్తించబడ్డాయని, ప్రస్తుతం రాష్ట్రంలో వేలాది మందికి పైగా క్యాన్సర్‌తో పోరాడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఓఎన్‌జీసీ సిఎస్ఆర్ కింద గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒక్కోటి సుమారు రూ.30 కోట్ల విలువైన రెండు అత్యాధునిక లైనాక్ యంత్రాలను మంజూరు చేశారు. మొత్తం రూ.60 కోట్ల విలువైన ఈ యంత్రాల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో క్యాన్సర్ చికిత్సకు పెద్ద ఊతం లభిస్తుందని అన్నారు. ఈ యంత్రాల కోసం అవసరమైన ప్రత్యేక బంకర్లు, మౌలిక వసతులు, శిక్షణ పొందిన ఆంకాలజిస్టులు, సాంకేతిక సిబ్బంది ఇప్పటికే సిద్ధంగా ఉన్నారని, యంత్రాల ఏర్పాటు పూర్తయ్యిన వెంటనే సేవలు ప్రారంభించగలిగే పరిస్థితి ఉందన్నారు. యంత్రాల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసేందుకు హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ ద్వారా అమలు చేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు సమీప రాష్ట్రాల రోగులకు కూడా సమయానుకూలంగా, అంతర్జాతీయ ప్రమాణాల రేడియోథెరపీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేయడంలో సహకరించిన కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి హృదయపూర్వక ధన్యవాదాలు అని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# దేశాన్ని ప్రేమించే వారైతే డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

● మైలవరం పట్టణంలో డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



మైలవరం (చైతన్యరథం): దేశాన్ని ప్రేమించే వారైతే డ్రగ్స్, మత్తుకు దూరంగా ఉండాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు. మైలవరం పట్టణంలో డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమంలో విజయవాడ సీపీ ఎస్.వి రాజశేఖరబాబు, ఐపీఎస్, పోలీసు అధికారులతో పాటు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు బుధవారం పాల్గొన్నారు. విద్యార్థులు, ప్రజలు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గళమెత్తారు. ప్రతిజ్ఞ చేశారు. సైకిల్‌ను తొక్కి ర్యాలీలో పాల్గొన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో.. సైకిల్ తొక్కు బ్రో..', 'సిగరెట్టు– రోగానికి మొదటి మెట్టు.. గుట్కా– నరకానికి దగ్గరి దారి.. గంజాయి– శ్మశానంలో చోటు ఖరారు.. డ్రగ్స్– ఆ మూడింటికీ మించి..' అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి, యువకుడు తన కుటుంబానికి, ఈ దేశానికి ఉపయోగపడాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష. గంజాయి, డ్రగ్స్ బారిన పడితే ఏదో ఒకరోజు పట్టుబడక తప్పదు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద అరెస్టయితే వారి జీవితంపై పిడుగు పడ్డట్లే..కనీసం పదేళ్ల జైలు శిక్ష పడుతుంది. జీవితంలో కీలక సమయం కోల్పోతారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు యువత, విద్యార్థుల జీవితాలను చిత్తు చేస్తున్నాయి. ఎన్నో దుష్పరిణామాలకు కారణమవుతున్నాయి. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వినియోగం లేకుండా చేయడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. డ్రగ్స్ తీసుకుంటే చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకున్నట్లే. మీరు తీసుకునే డ్రగ్స్ మీకు, మీ కుటుంబానికే కాదు సమాజానికి, దేశానికీ నష్టమే. డ్రగ్స్‌కు దూరంగా.. లక్ష్య సాధనకు దగ్గరగా ఉండాలన్నారు." అని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహనరావు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# కాళీపట్నం భూములు మినహా మిగిలినచోట్ల ఎన్‌వోసీ అక్కర్లేదు : కలెక్టర్

మొగల్తూరు (చైతన్యరథం): ఆక్వా సాగు అనుమతులకు సంబంధించి కాళీపట్నం భూములు మినహా మిగిలినచోట్ల వీఆర్వోల నుంచి ఎన్వోసీ అవసరం లేదని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి స్పష్టం చేశారు. నరసాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ జేసీతో కలిసి సందర్శించారు. దస్త్రాలను తనిఖీ చేశారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలించారు. పట్టణంలో సేకరించిన చెత్త వేసేందుకు స్థలాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రీ సర్వేలో చినమామిడిపల్లి, దర్భిపర్రులో భూములకు సంబంధించి ఏర్పడిన సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. ఇక నుంచి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించామన్నారు. అనంతరం ఎల్బీ చర్లలో రైతులతో మాట్లాడారు. ధర్భరేవు డ్రైన్ ప్రక్షాళన, అవుట్‌ఫాల్ స్లూయిజ్ ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్ను కోరారు. అనంతరం పీఎం లంకలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు పూర్తైన సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో చారిత్రక విజయాలు సాధించామని ప్రవీణ్ పేర్కొన్నారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... అనేక సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను పునరుద్ధరించి ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తల్లికి వందనం పథకం ద్వారా రూ.10,090 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేసి 67.27 లక్షల మంది విద్యార్థులకు మద్దతు అందించామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద 5 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు కల్పించి రూ.1,513 కోట్లు వ్యయం చేశామన్నారు. దీపం పథకం ద్వారా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఇప్పటివరకు 3.64 కోట్ల సిలిండర్లు పంపిణీ చేసి రూ.2,891 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల రైతులకు రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ చేశామని, ఎన్టీఆర్ భరోసా ద్వారా ప్రతి నెలా 63 లక్షల మందికి పింఛన్లు అందిస్తూ ఇప్పటివరకు రూ.58,654 కోట్లు వ్యయం చేసి దేశంలోనే రికార్డు సాధించామని చెప్పారు. సమాజంలోని ప్రతి వర్గానికి అండగా ప్రభుత్వం మత్స్యకార భరోసా, నేతన్నలకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లకు వార్షిక సాయం, అన్న క్యాంటీన్ల ద్వారా కోట్లాది భోజనాలు, గీత కార్మికులు, స్వర్ణకారులు, పాస్టర్లు, ఇమాములు, మౌజన్లు, అర్చకులు, నాయి బ్రాహ్మణులు, జూనియర్ లాయర్లకు గౌరవ వేతనాలు అమలు చేస్తూ సమగ్ర సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని భాష్యం ప్రవీణ్ అన్నారు. విద్య, ఉద్యోగాలు, భద్రత మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీ, 5,757 కానిస్టేబుల్ నియామకాలు పూర్తి చేయడం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు, బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు వంటి చర్యలు ప్రజలపై ప్రభుత్వ బాధ్యతను చాటుతున్నాయని పేర్కొన్నారు.

## స్వయం సహాయక మహిళల్లో కొత్త ఉత్సాహం

●హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డిలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో 3వ రోజు శిక్షణ



విజయవాడ (చైతన్యరథం): ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) సారథ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. కార్యాలయంలో అందిస్తున్న హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణను ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలు సమర్థంగా వినియోగించుకుంటున్నారు. తమ జీవనోపాధి అవకాశాలను విస్తరించుకునేందుకు వారిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం కొత్త ఉత్సాహం, స్ఫూర్తిని నింపుతోంది. ఫిబ్రవరి 9 వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో మూడవ రోజు బుధవారం ఎన్.ఐ.ఆర్.డిలో ఎస్.హెచ్.జి మహిళలు పొందిన శిక్షణ వివరాలను తెలియజేస్తూ ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో ముందుగా గిఫ్ట్ బాక్స్ నిర్మాణం, కొలతలు ఏ విధంగా తీసుకోవాలి, ఉపయోగించే పదార్థాలు, ఫినిషింగ్ ఎలా వుండాలనే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గిఫ్ట్ బాక్స్‌లో ఉపయోగించే కాగితం, కార్డ్‌బోర్డు, డెకరేటివ్ షీట్లు, గ్లూ వంటి పదార్థాల వినియోగం, మడతలు వేయడం, అతికించడం, అంచుల ఫినిషింగ్ వంటి అంశాలపై వివరంగా శిక్షణ ఇచ్చారు. ఇక ప్రాక్టికల్ సెషన్‌లో విద్యార్థులతో స్వయంగా హ్యాండ్‌మేడ్ గిఫ్ట్ బాక్స్ తయారీ చేయించారు. గిఫ్ట్ బాక్స్‌కి సంబంధించిన కట్టింగ్, ఫోల్డింగ్, అసెంబ్లింగ్, ఫినిషింగ్, అలంకరణ వంటి దశలను శిక్షణ పొందుతున్న మహిళలతో చేయించారు. అలాగే కొలతల ప్రకారం కట్ చేయడం, అంచులు సరైన అమరికతో సమానంగా వుండేలా నాణ్యత మెరుగుదల పద్ధతులు కూడా నేర్పించారు. శిక్షణ పొందుతున్న మహిళలు పేపర్ బ్యాగ్స్‌తో పాటు గిఫ్ట్ బాక్స్‌లు తయారు చేశారు.

## మార్చి 7వ తేది వరకు అసెంబ్లీ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి నెల 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతిరోజూ ఉదయం గం.9:00 నుంచి మధ్యాహ్నం గం.1:30 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈనెల 14న బడ్జెట్ సమావేశం నిర్వహించనుంది. 15, 16న సెలవులు కాబట్టి 17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ, 18న రాష్ట్ర పద్దుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఉంటుంది.

## అమరావతికి కేంద్రం నుంచి తీపికబురు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి సంబంధించిన నిధులపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. కేంద్రం అమరావతికి ప్రత్యేక సాయంగా రూ.1500 కోట్లు ప్రకటించింది. అయితే గత జనవరి వరకు మొత్తం రూ.750 కోట్లు అమరావతికి విడుదల చేసినట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి రాజ్యసభలో తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానంగా వివరాలను వెల్లడించారు. ఈ నిధులతో పాటుగా వరల్డ్ బ్యాంకు, ఏడీబీ (ఆసియా అభివృద్ధి బ్యాంకు)ల ద్వారా రూ.5,120 కోట్లు కూడా ఏపీకి విడుదల చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు.

## నగర శోభ పెరిగే విధంగా గుణదల మేరీమాత ఉత్సవాలు



పటమట (చైతన్యరథం): విజయవాడలో గుణదల మేరీమాత ఉత్సవాల ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ.. తమిళనాడు వేళాంగిణి మేరీమాత ఉత్సవాల తరహాలోనే వచ్చే ఏడాది మరింత గొప్పగా విజయవాడ నగర శోభ పెరిగే విధంగా గుణదల మేరీమాత ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్తో కలిసి కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దేశ విదేశాల్లో గుణదల మేరీమాత ఉత్సవాల గురించి చర్చించుకునేలా మరిన్ని వసతులు, సదుపాయాలు కల్పించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

## మంత్రి లోకేష్ చిత్రపటానికి విజయవాడలో పాలాభిషేకం



విజయవాడ (చైతన్యరథం): అత్యధిక ట్యూషన్ ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో అండగా నిలుస్తుందని, తద్వారా వారి చదువు మధ్యలో ఆగిపోకుండా ఉంటుందని తెలుగుయువత రాష్ట్ర నాయకుడు తుమ్మల వెంకట చైతన్య వ్యాఖ్యానించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ... బుధవారం విజయవాడ ఈట్ స్ట్రీట్ వద్ద శాప్ ఛైర్మన్ రవినాయుడు, స్థానిక విద్యార్థులతో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు పెద్ద ఉపశమనం కలిగించిందన్నారు. ఈ పథకం ద్వారా చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు మంచి నైపుణ్యాలు పొంది, మెరుగైన ఉద్యోగాలు సాధించడానికి, తద్వారా వారి ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్, పిజి, మరియు ఇతర ప్రొఫెషనల్ కోర్సులను ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువుకోవచ్చునని అన్నారు.

**తుమ్మల వెంకట చైతన్య మాట్లాడుతూ...** ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో అనేక మంది విద్యార్థులు విద్యను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి నుంచి బయటపడ్డారని, వారి భవిష్యత్తుకు ఈ నిర్ణయం గొప్ప భరోసా కల్పించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లే చేసి చూపిస్తోందనడానికి ఇది స్పష్టమైన నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యార్థులందరి తరపున మంత్రి నారా లోకేష్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమములో ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు నాగుల్ మీరా, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ పాల్గొన్నారు.

## బీఏసీ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): ప్రభుత్వ చీఫ్‌విప్ జివి ఆంజనేయులు బుధవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులకు పుష్ప గుచ్ఛాలతో చీఫ్ విప్ జీవీ స్వాగతం పలికారు. శాసనసభలోని స్పీకర్ కార్యాలయంలో జరిగిన బిఏసి సమావేశానికి ముఖ్యమంత్రితో కలిసి హాజరయ్యారు. బిఏసి సమావేశంలో నిర్ణయాలు, అసెంబ్లీ నిర్వహణపై తన అభిప్రాయాన్ని జీవీ తెలియజేశారు. శాసనసభ సమావేశాలు అందరూ దృష్టిలో పెట్టుకుని విప్‌లతో జీవి ఆంజనేయులు ఇప్పటికే సమావేశమై సూచనలు చేశారు. అసెంబ్లీ సమావేశాలు అర్థవంతంగా జరిగి, ప్రజా సమస్యలు కీలక అంశాలపై చర్చ జరిగేలా ముఖ్యమంత్రి సూచనల మేరకు జీవి ఆంజనేయులు సభ్యులకు సూచించారు.

## రైతుబజార్ ఆరోపణలపై విచారణ : ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం రైతు బజార్‌లో అవినీతి జరుగుతుందంటూ వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. గన్నవరం రైతు బజార్‌లో దుకాణాల కేటాయింపులో అవినీతికి పాల్పడుతున్నట్లు, టమాట, దుంపల విక్రయాలు ఓ వ్యక్తి కనుసన్నల్లో జరుగుతున్నట్లు కొన్ని చానళ్లలో కథనం ప్రసారమైంది. సదరు ఛానల్‌లో వచ్చిన కథనాలకు స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ రైతు బజార్‌లో జరుగుతున్న కార్యకలాపాలపై ఆరా తీశారు. దుంపల విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నాయా లేదా అని అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సదరు ఛానల్లో వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని, అక్రమాలున్నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. రైతులు, వినియోగదారుల శ్రేయస్సు కోసం ఏర్పాటుచేసిన రైతు బజార్లలో అక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

గన్నవరం నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు చోటు లేదని, అక్రమాలను ఎట్టి పరిస్థితులను సహించేది లేదని యార్లగడ్డ హెచ్చరించారు. గన్నవరం రైతు బజార్ నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు ఉంటే పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సీసీ యూనిట్ పునరుద్ధరణ



## ఎంపీ వేమిరెడ్డి వినతిపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సానుకూల స్పందన

కందుకూరు, పట్టణంలోని ప్రతిష్టాత్మక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో ఉన్న ఎన్‌సీసీ(నేషనల్ క్యాడెట్ కార్ప్స్)ను తిరిగి పునరుద్ధరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయానికి వెళ్ళి కలిశారు. ఎన్‌సీసీ పునరుద్ధరణపై వినతి పత్రం అందజేశారు. జనవరి 31, 2026న మియావాకీ ఫారెస్ట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా కందుకూరులోని టిఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది కాలేజీలో ఎన్‌సీసీ పునరుద్ధరించేలా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వెంటనే స్పందించిన ఆయన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఎన్‌సీసీపై పూర్తి వివరాలు అందించారు. ఏర్పాటుపై కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ అయిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ యువత అభివృద్ధికి మూలస్తంభంగా పనిచేస్తోందని, యువతలో ఐక్యత, క్రమశిక్షణ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 1948లో ఎన్సీసీ ప్రారంభమవగా సరిగ్గా 8 సంవత్సరాల తర్వాత 1964లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సీసీ యూనిట్ ఏర్పడిందని వివరించారు. 1964 నుండి విజయవంతంగా నడుస్తున్న ఎన్సీసీ విభాగం నుంచి చాలా మంది ఎన్సీసీ క్యాడెట్లు భారత సైన్యం, పోలీసు వంటి వాటిలో చేరి సేవ చేస్తున్నారన్నారు. అయితే కళాశాల పరిపాలనలో కొంత లోపం కారణంగా శాశ్వత అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడంతో 2023లో టీఆర్ఆర్ కళాశాల నుండి యూనిట్‌ను ఉపసంహరించారని వెల్లడించారు. మూసివేయడం వల్ల విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడిందని, శిక్షణ పొందాలనుకునే క్యాడెట్‌లకు ఎన్సీసీ దూరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కళాశాలలో సాధారణ అసోసియేట్‌ఎన్సీసీ అధికారి ఉన్నారని, మళ్లీ ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయగలిగితే నేవీ శిక్షణతో పాటు తీరప్రాంత విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. శిక్షణ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూనిట్‌ను పునరుద్ధరించేలా సంబంధిత అధికారులకు సూచించాలని కేంద్రమంత్రికి ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎంపీ విజ్ఞప్తులను పరిశీలించిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటామని, శిక్షణ, మార్గదర్శకత్వం అవకాశాలను పొందేలా చూస్తామని హామీ ఇచ్చారు.



# డ్రోన్ పెట్రోలింగ్‌తో మహిళల మరింత భద్రత

## జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి(చైతన్యరథం): జిల్లాలోని కళాశాలలు, విద్యాసంస్థలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు డ్రోన్ పెట్రోలింగ్ విస్తృతంగా అమలు చేయాలని, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం బహుముఖ కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పోలీసు శాఖను ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతలు, మహిళల సంరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన, తదితర అంశాలపై జిల్లాలోని డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లతో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళలపై నేరాలను సమూలంగా రూపు మాపేందుకు.. రెవెన్యూ శాఖ సమన్వయంతో సమగ్ర కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే వారిపై పీడీ చట్టం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, హాట్స్పాట్ ప్రాంతాల్లో డ్రోన్ నిఘాను మరింత పెంచే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రోన్ పెట్రోలింగ్ విధానం, కేసులపై తీసుకున్న చర్యలను అవగాహన కార్యక్రమాలలో తెలియజేయాలన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిల విడుదల హర్షణీయం

## మంత్రి లోకేశ్‌కు పుత్తూరు తెలుగుయువత కృతజ్ఞతలు



పుత్తూరు, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు తీపి కబురు అందించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాలు మేరకు, గత ప్రభుత్వం నుంచి పెండింగ్ లో ఉన్న రూ. 1,200 కోట్లు ఫీజు రియంబుర్స్మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పెద్ద ఉపసమానం లభించింది. విద్య రంగానికి పెద్దపిట వేస్తూ, నిధుల కొరత లేకుండా చూస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ, తెలుగుయువత నియోజకవర్గం అధ్యక్షుడు ముద్దుకృష్ణ నాయుడు, టౌన్ తెలుగుయువత అధ్యక్షులు ప్రణయ్ కుమార్ రాయల్, మండల తెలుగుయువత అధ్యక్షులు ధన యాదవ్, తాజ్ ఖాన్ బాషా, షో అఫ్ శీనా, ప్రభాకర్, రామాంజినేయులు,రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు విడుదల చేసిన మంత్రి లోకేశ్‌కు పాలాభిషేకం

# వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు



## పారిశ్రామిక ప్రగతితో యువతకు ఉపాధి : నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(చైతన్యరథం): 'వ్యవసాయ ఆధారిత జిల్లాలో అన్ని ప్రాంతాలను సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రామాయపట్నం పోర్టు ప్రకాశం జిల్లాలో కలిసినప్పటికీ.. బీపీసీఎల్, ఇండోసోల్ సంస్థల అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. కావలి, కోవూరు మధ్యలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సుముఖత వ్యక్తమవుతోంది. దీంతో పాటు కావలి, దుత్తలూరు జాతీయ రహదారి వెంట పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పని చేస్తున్నాం' అని కలెక్టర్ హిమాన్ శుక్లా తెలిపారు. జిల్లాలో చేస్తున్న అభివృద్ధి పనులను ఆయన వివరించారు.

### 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టు

వరి పండించే పొలాల గట్లపై ఆయిల్ ఫాం, కొబ్బరి చెట్లు నాటుతున్నారు. ఉదయగిరి, కావలి, కలిగిరి ప్రాంతాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఉపాధి పథకం ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. జలాశయాల్లో నీరుండటం.. ప్రభుత్వ రాయితీలతో.. 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టు పెరిగింది. 2,500 ఎకరాల్లో బిందు సేద్యం పరికరాలు ఇస్తున్నాం. కలువాయి మండలంలో వినియోగించే కోడిగుడ్లను నెల్లూరు నుంచి తీసుకువెళుతున్నట్లు తెలిసింది. దీంతో సుమారు 100 గ్రామాల్లో పౌల్ట్రీ సెక్టార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన స్థలాలు ఉన్నాయి. బీపీసీఎల్ కు ఇప్పటికే 3,500 ఎకరాలు అప్పగించాం. మరో 600 ఎకరాలు పురోగతిలో ఉంది. ఇండోసోలు 4,800 ఎకరాలకు... 1200 అప్పగించాం. క్రిస్ సిటీకి సంబంధించి ఇప్పటికే 2,500 ఎకరాల భూసేకరణ జరిగింది. ఇంకో ఎనిమిది వేల ఎకరాలు చేయాల్సి ఉంది. ఎక్కడా అవకతవకలు జరగకుండా డ్రోన్ సర్వే చేయించామన్నారు. జువ్వలదిన్నె హార్బర్ పనులు మార్చి చివరికి పూర్తి చేస్తాం. ఈ ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చర్స్తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. ఇఫ్కో సెజ్లోనూ పరిశ్రమలు వస్తాయి. కావలి, ఉదయగిరి మధ్యలో రూ.వేయి కోట్లతో ఓ పరిశ్రమ రాబోతోంది. ఇందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఇదే ప్రాంతంలో మరో నాలుగు పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇవన్నీ జరిగితే.. అన్ని ప్రాంతాల్లో సమాంతర అభివృద్ధి ఉంటుంది.



# త్వరలో ఒంటిమిట్ట ఆలయంలో నిత్యాన్నదానం

## ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ఒంటిమిట్ట(చైతన్యరథం): ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయం సమీపంలో తితిదే ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న నిత్యాన్నదానం ఏర్పాట్లను అధికారులు బుధవారం ఉదయం పరిశీలించారు. ప్రత్యేకాధికారి శాస్త్రి, డిప్యూటీ ఈవోలు సెల్వం, ప్రశాంతి, ఈఈలు సుమతి, రవిశంకర్ రెడ్డి, నరసింహ మూర్తి, డీఈ నాగరాజు, డీసీవో విజయభాస్కర్, ఏఈ అమరనాథ్ రెడ్డితో పాటు మరికొందరు అధికారులు పరిశీలించారు. ఒకేసారి 150-200 మంది భక్తులు కూర్చుని భోజనం చేసేలా వసతులు కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం వసతి కల్పించాలని నిర్ణయించారు.

# ఇన్విజిలేటర్ల నియామకాల్లో నూతన విధానం

## టెన్త్ పరీక్షల నేపథ్యంలో అమలు



చిత్తూరు(చైతన్యరథం): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చేనెల 16 నుంచి జరగనున్న నేపథ్యంలో ఇన్విజిలేటర్ల నియామకాల్లో నూతన విధానాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. పరీక్షలు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్) లో నమోదు చేసిన ఉపాధ్యాయుల వివరాల ప్రకారం పరీక్షల ఇన్విజిలేషన్ విధులు కేటాయిస్తారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులే ఇన్విజిలేటర్లును నియమించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలోనే డీఈవో, డీవైఈవోలు ఇన్విజిలేటర్లను నియమించేవారు. గతంలో పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లుగా నియమితలయ్యే ఉపాధ్యాయుల్లో కొందరు సాకులు చెబుతూ విధులు రద్దు చేయించుకునేవారు. ఇప్పుడు ఈ విధానానికి స్వస్తి పలికారు.

### కొందరికే మినహాయింపు

విధులకు 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇస్తారు. తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషా సబ్జెక్టులకు నాన్ భాషా సబ్జెక్టులైన గణితం, సైన్స్ సోషియల్ ఉపాధ్యాయులను నియమించగా.. భాషేతర సబ్జెక్టులైన గణితం, సైన్స్, సోషియల్ పరీక్షలకు భాషోపాధ్యాయులకు విధులు కేటాయిస్తారు. దీంతో పరీక్షలు మరింత పకడ్బందీగా నిర్వహించనున్నారు. గతంలో పరీక్ష జరిగే సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఆ రోజు మినహాయింపు ఇచ్చేవారు. ఇప్పుడా పద్ధతిలో మార్పు కనిపించనుంది.

# సంజామలలో వైసీపీ ఖాళీ : టీడీపీలో చేరిన 20 కుటుంబాలు

## కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి బీసీ సతీమణి ఇందిరారెడ్డి

సంజామల (చైతన్యరథం): బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి సమక్షంలో సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన 20 ఎస్సీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై తమ విశ్వాసాన్ని తెలుగుదేశం పార్టీపైన ఉంచుతున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ప్రజల సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరా రెడ్డి చేరికైన కుటుంబాలకు పార్టీ కండువాలు కప్పి, వారిని హృదయపూర్వకంగా పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని, ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి పూర్తి సహకారం అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకుమళ్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లు మహేశ్వర రెడ్డి, కైపా వెంకట రమణా రెడ్డి, ఏరాసి పుల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# విద్యార్థుల భవిష్యత్తును కాపాడిన మంత్రి లోకేష్

## సర్వత్రా వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు

చిట్వేల్ (చైతన్యరథం): రాష్ట్రంలోని పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం కలగకుండా, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ. 1,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా బుధవారం మంగళగిరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణస్వామి విద్యార్థులతో వెళ్ళి మంత్రి లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ, గత ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేసిందని విమర్శించారు. వందల కోట్ల బకాయిలను విడుదల చేయడం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గత ఐదేళ్లలో ఫీజులు చెల్లించకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల్లో ఆగిపోయేలా చేసి, జగన్ రెడ్డి విద్యార్థుల పట్ల 'కంస మామ'గా వ్యవహరించారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసీపీకి రానున్న రోజుల్లో యువత సమాధి కట్టడం ఖాయం. విభిన్న ప్రతిభావంతుల చైర్మన్ నారాయణస్వామి మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి లోకేష్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ నిధుల విడుదల వల్ల వేలాది మంది విద్యార్థులు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా తమ సెమిస్టర్ పరీక్షలు రాసుకునే వెసులుబాటు కలిగిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, మంత్రి నారా లోకేష్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ తమ సంతోషాన్ని పంచుకున్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

## అధికారులకు నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ పిలుపు

మహానంది(చైతన్యరథం): సుప్రసిద్ధ మహానంది పుణ్యక్షేత్రంలో ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని.. అందుకు ప్రతి ఒక్కరి సహకారం కావాలని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం మహానంది ఆలయ ఈవో నల్లకాలవ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో రెండో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సులభంగా దర్శనం కల్పించేందుకు వీలుగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థంగా పనిచేయాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల కోసం తాగునీరు, ఉచిత మజ్జిగ పంపిణీ, వైద్య సదుపాయాలు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, భక్తుల భద్రత, అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఇంజిన్ల ఏర్పాటు, భక్తుల కాలక్షేపానికి సాంస్కృతిక కళా ప్రదర్శనలు, మరింత సమర్థంగా రథోత్సవం, పారిశుద్ధ్య చర్యలు తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు.



# ఇక నుంచి ముందే వందేమాతరం ఆలాపన

## కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం



జాతీయ గేయం వందేమాతరం ఆలాపనపై కొత్త నిబంధనలను కేంద్రం అమల్లోకి తెచ్చింది. ఇకనుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం అలపించాలి. అధికారిక కార్యక్రమాలు, వేడుకల్లో తొలుత 3 నిమిషాల 10 సెకన్ల పాటు వందేమాతరం 6 చరణాలను ఆలపించాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ ప్రకటించిన వందేమాతరం కొత్త ప్రోటోకాల్ బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నిబంధనల ప్రకారం, వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో ప్రతి ఒక్కరూ లేచి నిలబడాలి. పౌర పురస్కారాలు, రాష్ట్రపతి, గవర్నర్లు పాల్గొనే అన్ని కార్యక్రమాల్లోనూ వందేమాతరం ఆలపించాలి. సినిమా హాళ్లలో దీన్ని ప్రదర్శించాల్సిన అవసరం లేదు. జాతీయ గీతం, జాతీయ గేయం ఆలపించేటప్పుడు అంతరాయం కలిగిస్తే బాధ్యులకు మూడేళ్ల వరకూ జైలుశిక్ష పడుతుంది. స్కూళ్ల కార్యక్రమాలు తప్పకుండా వందేమాతరం కార్యక్రమంతో మొదలు కావాలి. ఇందుకోసం పాఠశాలల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలి. కాగా, ప్రత్యేక కార్యక్రమాలు, వేడకల్లో వందేమాతరం ఆలాపన చేయాలని అనుకుంటే తగిన ఆడియో సిస్టమ్‌ను సమకూర్చుకోవాలి. అవసరమైతే గేయం ఆలాపనకు వీలుగా ఆరు చరణాలతో కూడిన కరపత్రాలను కార్యక్రమానికి హాజరైన వారికి పంపిణీ చేయవచ్చు. దేశభక్తి, మాతృభూమిపై ప్రేమతో మర్యాదపూర్వకంగా సముచితమైన పద్ధతిలో ఏ కార్యక్రమంలో నైనా వందేమాతరం ఆలపించవచ్చని కేంద్రం తెలిపింది. వందేమాతర గేయం 150 వసంతాల వేడుకలను కేంద్ర నిర్వహిస్తున్న వేళ ఈ నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# సుప్రీంకోర్టులో వాన్‌పిక్‌కు చుక్కెదురు!



వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో వాన్‌పిక్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సీబీఐ కేసులను కొట్టివేయడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. వాన్‌పిక్ ప్రాజెక్టులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి రికార్డులను పరిశీలించిన తర్వాత కేసుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, సీబీఐ మోపిన అభియోగాలపై విచారణను కింది కోర్టులో ఎదుర్కొని తేల్చుకోవాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వాన్‌పిక్ గతేడాది అక్టోబరు 28న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలో జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. వాన్‌పిక్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ జరపాలని గతంలోనే హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించిందని, అయితే, తమ వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. సీబీఐ మోపిన అభియోగాలపై దిగువ కోర్టులోనే తేల్చుకోవాలని చెప్పిందని, అసలు నేరం ఏమిటో?, ఏ సెక్షన్ల కింద విచారిస్తున్నారో కూడా పేర్కొనలేదని చెప్పారు. కనీసం నేరమేమిటో చెప్పకుండా విచారణను ఎదుర్కోవాల్సిందేనని చెప్పడం సరికాదన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, హైకోర్టు ఉత్తర్వుల్లో కలుగజేసుకోలేమని తేల్చి చెప్పింది. హైకోర్టులోనే సమగ్ర వాదనలు వినిపించాలని గతంలో సుప్రీంకోర్టుకు వచ్చినప్పుడే సూచించామని గుర్తు చేసింది. 'హైకోర్టు ఇరుపక్షాల వాదనల తర్వాతే ఉత్తర్వులు ఇచ్చింది కదా! ప్రస్తుతానికి ఈ విషయంలో జోక్యం చేసుకోలేం' అంటూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

### కేసు పూర్వాపరాలు

2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని తీర మండలాల్లో వాడరేవు-నిజాంపట్నం పారిశ్రామిక కారిడార్(వాన్‌పిక్) ప్రాజెక్టు కోసం 22 వేల ఎకరాలను సేకరించారు. ఆ ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని సీబీఐ కేసులు నమోదు చేయడంతో ప్రాజెక్టు నిలిచిపోయింది. భూముల కేటాయింపునకు ప్రతిఫలంగా నాటి సీఎం కుమారుడు వైఎస్ జగన్‌కు చెందిన కంపెనీల్లో నిమ్మగడ్డ ప్రసాద్ రూ.854 కోట్ల పెట్టుబడులు పెట్టారని, ఇది క్విడ్ ప్రో కో కిందకు వస్తుందని సీబీఐ అభియోగపత్రంలో పేర్కొంది. సీబీఐ కేసులను కొట్టివేయాలంటూ వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ 2021లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయగా కేసులను కొట్టివేస్తూ 2022 జూలైలో వాన్‌పిక్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ తీర్పును సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. కేసును కొట్టివేయడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేసు పూర్వాపరాలపై మరోసారి సమగ్రంగా విచారించి తీర్పు ఇవ్వాలంటూ తిరిగి హైకోర్టుకు పంపింది. రికార్డులను పరిశీలించిన తర్వాత కేసుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, సీబీఐ మోపిన అభియోగాలపై విచారణను కింది కోర్టులో ఎదుర్కొని తేల్చుకోవాలని పేర్కొంటూ హైకోర్టు 2025 ఆగస్టు 26న తీర్పు వెలువరించింది. ఆ తీర్పుపై వాన్‌పిక్ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించగా జోక్యం చేసుకోలేమంటూ తాజాగా పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అమెరికా సానుకూలం

## మార్చి నెలలో తుది సంతకాలు జరిగే అవకాశాలు



అమెరికా, భారత్ మధ్య ఇటీవల కుదిరిన ట్రేడ్ డీల్‌పై రాబోయే మార్చి నెలలో తుది సంతకాలు జరిగే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే డీల్‌లోని కీలక అంశాలతో కూడిన ఫ్యాక్ట్ షీట్‌ను అమెరికా విడుదల చేసింది. అమెరికా-భారత్ మధ్య ఇటీవల కుదిరిన ట్రేడ్ డీల్‌పై రాబోయే మార్చి నెలలో తుది సంతకాలు జరిగే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ ఒప్పందం కుదిరిన తర్వాత డీల్‌లోని కీలక అంశాలతో కూడిన ఫ్యాక్ట్ షీట్‌ను అమెరికా విడుదల చేసింది. అయితే ఆ ఫ్యాక్ట్ షీట్‌లో కొన్ని అంశాల పట్ల భారత్‌లో వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో కొన్ని గంటల్లోనే ఆ ఫ్యాక్ట్ షీట్‌లోని ఇబ్బందిరక అంశాల్లో అమెరికా మార్పులు చేసింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే పప్పు ధాన్యాలపై భారత్ సుంకాలను తగ్గిస్తుందని మొదట విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌లో వైట్ హౌస్ పేర్కొంది. ఈ విషయంపై భారత్‌లో వ్యతిరేకత వచ్చింది. ప్రపంచంలోనే మన దేశం అతిపెద్ద పప్పు ధాన్యాల ఉత్పత్తిదారు. అలాగే పప్పు ధాన్యాల వినియోగం విషయంలో కూడా భారతదేశమే నెంబర్ వన్. ఈ నేపథ్యంలో అమెరికా పప్పు ధాన్యాల దిగుమతులపై సుంకాలను తగ్గిస్తే ఇక్కడి రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయంలో భారత్ నుంచి వ్యతిరేకత రావడంతో అమెరికా దిగి వచ్చింది. పప్పు ధాన్యాల దిగుమతులపై భారత్ సుంకాలను తగ్గిస్తుందని మొదట పేర్కొన్న అమెరికా, రెండో ఫ్యాక్ట్ షీట్‌లో ఆ ప్రస్తావన లేకుండా చేసింది. అలాగే 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తుల కొనుగోలుకు భారత్ 'కట్టుబడి ఉంది' అని తొలుత పేర్కొన్న అమెరికా.. ఆ తర్వాత దానిని 'కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఉంది' అని మార్చింది. అలాగే భారతదేశం డిజిటల్ సేవల పన్నులను తొలగిస్తుందనే వాదనల్లో కూడా ట్రంప్ బృందం వెనక్కి తీసుకుంది. డిజిటల్ సేవల విషయంలో ఎదురవుతున్న అడ్డంకులను పరిష్కరించే నియమాల గురించి చర్చించడానికి భారతదేశం కట్టుబడి ఉందని పేర్కొంది.

# విపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

## కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజువెల్లడి



లోక్‌సభలో ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసి, సభను తప్పుదారి పట్టించిన విపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వనున్నట్టు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై బడ్జెట్ చర్చలో రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. వీటిని మంత్రి రిజిజు తోసిపుచ్చారు. రాహుల్ గాంధీ బడ్జెట్ ప్రసంగాన్ని కిరణ్ రిజిజు ప్రస్తావిస్తూ.. 'రాహుల్ గాంధీ సభను తప్పుదారి పట్టించారు. నిరాధార ఆరోపణలు చేశారు. దీనిపై మేము సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం. ఉభయసభల్లోనూ సభా కార్యక్రమాల నిర్వహణకు స్పష్టమైన నియమ, నింబంధనలు ఉన్నాయి. ఒక సభ్యుడు మరో సభ్యుడిపై తీవ్ర ఆరోపణలు చేయాలనుకుంటే నోటీసు ఇవ్వాలి, ఆరోపణలను రుజువు చేయాలి' అని అన్నారు. తన వాదనలను నిరూపించే ఆధారలతో సభకు రావాల్సిందిగా రాహుల్‌కు సూచించాలని సభాపతికి తాను కోరనున్నట్టు చెప్పారు. ప్రధానిపైన, ప్రభుత్వంపైన రాహుల్ నిరాధార ఆరోపణలు చేశారని రిజిజు చెప్పారు. 'ప్రధానమంత్రి దేశాన్ని, దేశ ప్రయోజనాలను అమ్మేశారని ఆయన చెబుతున్నారు. దీనికి ఆధారాలున్నాయా? ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీపై కూడా రాహుల్ తీవ్రమైన ఆరోపణలు చేశారు' అని రిజిజు చెప్పారు. ఎలాంటి సాక్ష్యాలు, విధానపరమైన నోటీసులు లేకుండా రాహుల్ ఈ ఆరోపణలు చేశారని, ఆయన చేసిన తప్పుడు ఆరోపణలు, అమర్యాదకర వ్యాఖ్యలతో సహా ఆయన ప్రసంగం మొత్తాన్ని రికార్డుల నుంచి తొలగించాలని, ముఖ్యంగా ఆయన చెప్పిన అబద్ధాలు, నిరాధార ఆరోపణలను తొలగించాలని అన్నారు.

### ఎవరూ దేశాన్ని అమ్మలేరు

దేశాన్ని అమ్మేశారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై రిజిజు మండిపడ్డారు. ఏ ఒక్కరూ దేశాన్ని అమ్మడం కానీ, కొనడం కానీ చేయలేరని అన్నారు. కనీసం ఊహించడం కూడా సాధ్యం కాదని అన్నారు.

ఇదిలావుండగా భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ద్వారా 'భరతమాతను అమ్మేశారు' అని రాహుల్ తన ప్రసంగంలో ప్రభుత్వంపై తీవ్రారోపణలు చేశారు. ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాలపై రాజీపడ్డారని, గుత్తగా లొంగిపోయారని విమర్శించారు. అదే కనుక 'ఇండియా' కూటమి ప్రభుత్వం ట్రేడ్‌డీల్‌పై సంప్రదింపులు జరిపి ఉంటే ఇండియాను సమాన భాగస్వామిగా గుర్తించాలని అమెరికాకు గట్టిగా చెప్పి ఉండేవాళ్లమని అన్నారు. 'మీరు ఇండియాను అమ్మేశారు. ఇది సిగ్గుగా అనిపించడం లేదా? మీరు మన తల్లి భరతమాతను అమ్మేశారు' అంటూ తీవ్ర విమర్శలు చేశారు. భారతదేశ ఇంధన భద్రత ఇప్పుడు బలహీనమైందని, అమెరికా నిర్ణయాలపై ఆధారపడి చమురు కొనాల్సి వస్తుందని అన్నారు. రైతుల ప్రయోజనాలపై కేంద్రం రాజీపడిందని, ఇప్పుడు దేశీయ మార్కెట్‌లోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు వరదలా వచ్చిపడతాయని చెప్పారు. టెక్స్‌టైల్ పరిశ్రమపై ఇప్పటికే తీవ్ర ప్రభావం పడిందని, ప్రస్తుత విధానాలతో ఆ రంగం పూర్తిగా ఫినిష్ అయినట్టేనని అన్నారు. యుద్ధాల శకం ముగిసిందని ప్రధానమంత్రి మోదీ, ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నిరంతర ఘర్షణలే నేటి ప్రపంచ వాస్తవం అని అన్నారు.

# ఉద్రిక్తతల మధ్య..
# బంగ్లా ఎన్నికలు నేడు



- తారిక్‌కే అవకాశాలంటున్న పరిశీలకులు
- ఈ ఎన్నికలకు విలువ లేదంటున్న మాజీ ప్రధాని హసీనా
- ఫలితాలపై ప్రపంచ దేశాల ఆసక్తి

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామా తర్వాత దేశ పరిస్థితులు దారుణమైన తరుణంలో.. కీలక ఎన్నికలకు బంగ్లాదేశ్ సిద్ధమైంది. దాదాపు పదిహేనేళ్ల హసీనా పాలనకు ముగింపు పలికిన తర్వాత తొలిసారి (ఫిబ్రవరి 12న) జరుగుతున్న ఎన్నికలను ప్రపంచ దేశాలూ ఆసక్తిగా గమనిస్తున్నాయి. బంగ్లాదేశ్ జనాభా సుమారు 17 కోట్లు. ఎన్నికల సంఘం ప్రకారం అక్కడ 12.7 కోట్ల ఓటర్లున్నారు. వీరిలో 50లక్షల మంది కొత్త ఓటర్లు. విదేశాల్లో నివసిస్తున్న బంగ్లా పౌరులకు తొలిసారిగా పోస్ట్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. మొత్తం 1981మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బంగ్లా జాతీయ సభలో 350మంది చట్టసభ సభ్యులుండగా.. వీరిలో 300మందిని ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకుంటారు. మరో 50 స్థానాలు మహిళలకు రిజర్వ్ చేస్తారు. ఆయా పార్టీలు గెలుచుకునే సీట్ల సంఖ్యకు అనుగుణంగా మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాలను కేటాయిస్తారు. పార్లమెంట్ సభ్యుల పదవీకాలం ఐదేళ్లు. ఈ ఎన్నికలను పరిశీలించేందుకు ఐరోపా యూనియన్, కామన్వెల్త్ దేశాల నుంచి దాదాపు 500మంది విదేశీ పరిశీలకులు హాజరుకానున్నారు.

**తారిక్‌కు అవకాశాలు..**

దశాబ్దాలుగా బంగ్లాలో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్, తారిక్ రెహమాన్ (మొన్నటి వరకు మాజీ ప్రధాని ఖలీదా జియా) సారథ్యంలోని బంగ్లా నేషనలిస్ట్ పార్టీల హవానే కొనసాగుతోంది. అవామీ లీగ్‌పై 2024లో నిషేధం విధించడంతో బీఎన్పీ, జమాత్-ఏ-ఇస్లామీ కూటమి మధ్య పోటీ నెలకొంది. హసీనా హయాంలో నిషేధానికి గురైన జమాత్-ఏ- ఇస్లామీ.. ఆమె దేశం వీడిన తర్వాత మళ్లీ క్రియాశీలంగా మారింది. ఈ కూటమిలో మొత్తం 11 పార్టీలుండగా.. ఇటీవల ఆందోళనల సమయంలో ఏర్పడిన నేషనల్ సిటిజన్ పార్టీ భాగస్వామిగా ఉంది. దాదాపు 17 ఏళ్ల పాటు విదేశాలకే పరిమితమైన తారిక్ రెహమాన్ ఇటీవలే స్వదేశానికి తిరిగివచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను పునర్నిర్మించడంతోపాటు ఆర్థిక వ్యవస్థ, శాంతి భద్రతల పునరుద్ధరణకు ప్రయత్నిస్తానని హామీ ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీఎన్పీ ముందంజలో ఉన్నట్టు తెలుస్తోంది.

**ఉద్రిక్తతలవేళ ఎన్నికలు..**

దేశ జనాభాలో 90శాతం ముస్లింలే ఉండగా.. 8 శాతం హిందువులున్నట్టు అంచనా. అయితే, మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం వీడిన తర్వాత అక్కడ శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో క్షీణించాయి. మహిళలతోపాటు హిందువులపై బెదిరింపులు, దాడులు, హింసాత్మక ఘటనలు విపరీతంగా పెరిగాయి. స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని యూనస్ నేతృత్వంలోని యంత్రాంగం చెబుతోంది. ఇదే సమయంలో దేశంలోని అతి పెద్ద రాజకీయ పక్షమైన తమ పార్టీ (అవామీ లీగ్)ని పోటీ చేయకుండా నిషేధించి నిర్వహించే ఈ ఎన్నికలకు ఎలాంటి విలువ ఉండదని షేక్ హసీనా ప్రకటించడం గమనార్హం.

# టాయిలెట్ పేపర్‌లా వాడారు

**- అమెరికాపై పాక్ రక్షణ మంత్రి తీవ్ర ఆరోపణలు**



పాకిస్థాన్ రక్షణమంత్రి ఆసిఫ్ ఖవాజా అమెరికాపై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని దుయ్యబట్టారు. తర్వాత తమను టాయిలెట్ పేపర్‌కంటే ఘోరంగా తీసిపారేసిందన్నారు. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన పెద్ద తప్పిదమని వ్యాఖ్యానించారు. దీనివల్ల దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందని వాపోయారు. 1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్ పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించుకుందని ఆసిఫ్ ఖవాజా అన్నారు. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే, తాలిబన్లు తిరిగి తమపై హింసకు పాల్పడ్డారన్నారు. తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం తమకు ఎటువంటి సహాయం చేయలేదని ఆరోపించారు.

# కెనడాలో స్కూల్‌పైకి కాల్పులు

**- 10మంది మృత్యువాత.. 25మందికి గాయాలు**

**- మహిళా షూటర్ దురాఘతం.. ఆత్మహత్య**

కెనడాలోని బ్రిటీష్ కొలంబియాలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. కాల్పుల్లో 10మంది మృతిచెందారు. మరో 25మంది గాయపడ్డారు. కాల్పులకు తెగించిన వ్యక్తిని మహిళగా గుర్తించారు. ఆమెకు బ్రౌన్ కలర్ జుట్టు ఉన్నట్టు రాయల్ కెనిడియన్ మౌంటెడ్ పోలీసులు వెల్లడించారు. కాల్పులు జరిపిన తర్వాత స్కూల్ పరిసరాల్లోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. స్కూల్‌లోనే ఆరుగురి మృతదేహాలను గుర్తించారు. ఆస్పత్రికి తీసుకెళ్తున్న సమయంలో ఓ వ్యక్తి మరణించాడు. ఆ స్కూల్ కమ్యూనిటీ వద్ద ఉన్న ఓ ఇంట్లో మరో ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. టంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్‌లో కాల్పుల ఘటన జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఫైరింగ్ ఘటనలో రెండో షూటర్ ఉన్నారేమో అన్న అనుమానాలు పోలీసులు వ్యక్తం చేశారు. బాధితుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. టంబ్లర్ బ్రిడ్జ్ పట్టణంలో సుమారు 2500 మంది జనాభా ఉంటారు. అయితే ఈ ఘటన నేపథ్యంలో అక్కడ భద్రతను పెంచారు. స్కూల్‌ను వారంపాటు మూసివేస్తున్నట్టు ప్రకటించారు. ఘటన జరిగిన సమయంలో స్కూల్‌లో సుమారు వందిమంది విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.




అయితే వాళ్లందర్నీ సురక్షిత ప్రదేశానికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

మహిళా షూటర్ ఇంత దారుణానికి ఒడిగట్టడానికి కారణమేంటో అర్థం కావడం లేదని పోలీసులు చెబుతున్నారు. కాల్పులు జరుగుతున్న సమయంలో కొందరు విద్యార్థులు ప్రాణాలు రక్షించుకునే ప్రయత్నం చేశారు. టంబ్లర్ బ్రిడ్జ్‌లో జరిగిన షూటింగ్ ఘటన తమను కలిచివేసినట్టు కెనడా ప్రధాని మార్క్ కార్నే తెలిపారు. టంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్‌లో సుమారు 175మంది విద్యార్థులున్నట్టు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా తెలిసింది. వారంతా 7నుంచి 12వ గ్రేడ్ విద్యార్థులు.

# 17న భారత్‌కు మెక్రాన్

**- వాణిజ్యం, రక్షణ బంధంపై ప్రధాని మోదీతో చర్చలు**



మూడు రోజుల పర్యటన కోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ 17న భారత్ రానున్నారు. ఆయన ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. వాణిజ్యం, రక్షణవంటి కీలక రంగాల్లో రెండు దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు దృష్టిసారిస్తారు. మెక్రాన్ 17న ముంబయిలో అడుగు పెడతారు. అక్కడ మోదీతో కలిసి 'ఇండియా- ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'ను ప్రారంభిస్తారు. ఇద్దరు నేతలు ముంబయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది. "హొరైజన్- 2047 మార్గసూచీలో పేర్కొన్న అంశాలపై మోదీ, మెక్రాన్ సమాలోచనలు జరుపుతారు" అని భారత విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. హొరైజన్ మార్గసూచీని 2023లో మోదీ, మెక్రాన్ల మధ్య జరిగిన చర్చల సమయంలో ఆవిష్కరించారు. 19న ఢిల్లీలో జరిగే 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్లో మెక్రాన్ పాల్గొంటారు. భారత్‌కు 114రఫేల్ యుద్ధవిమానాల సరఫరాకు మెక్రాన్ పర్యటన సమయంలోనే ఒప్పందం కుదిరే అవకాశముంది. ఈ కాంట్రాక్టు విలువ రూ.3.25 లక్షల కోట్లు. ఇది ఖరారైతే దేశ చరిత్రలో అతిపెద్ద రక్షణ ఒప్పందంగా నిలవనుంది.

# జరిగింది బాధాకరమే!

**- హింసాత్మక అణచివేతలపై ఇరాన్ ప్రజలకు అధ్యక్షుడు పెజెష్కియాన్ క్షమాపణలు**



ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలపై అక్కడి భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపి హింసాత్మకంగా అణచివేసినందుకు ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఒకింత బాధ వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. అణచివేతలో కుటుంబీకులను కోల్పోయిన వారు, గాయపడిన వారు అనుభవించిన బాధ తనకు తెలుసన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని కట్టడి చేయలేకపోయినందుకు ప్రభుత్వం సిగ్గుపడుతోందని పెజెష్కియాన్ తెలిపారు. అయితే భద్రతాబలగాలు చేసిన దాడుల్లో అక్కడి నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్టు ఆయన పేర్కొనలేదు. పాశ్చాత్య దేశాలు చేసిన తప్పుడు ప్రచారాలవల్ల దేశంలో నిరసనలు చెలరేగుతున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం ఎప్పటికీ ప్రజలతో ఘర్షణలు, ఇతర దేశాలతో యుద్ధాలు కోరుకోదని అన్నారు. తాము పెద్ద మొత్తంలో అణ్వాయుధాలు తయారు చేస్తున్నామని ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని మసౌద్ పెజెష్కియాన్ స్పష్టంచేశారు. శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తిని ఉపయోగించుకునే చట్టబద్ధమైన హక్కులను మాత్రమే తాము కాపాడుకుంటామని తెలిపారు. చర్చలతో అన్ని సమస్యలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మరోవైపు అమెరికా చేస్తున్న డిమాండ్లకు ఇరాన్ ఎట్టిపరిస్థితుల్లోనూ లొంగదని స్పష్టంచేశారు.

# స్కూల్లో సాయుధ దుండగుడు

**- థాయిలాండ్‌లో దారుణం.. బందీల్లో భయాందోళన**

థాయిలాండ్‌లో దారుణం చోటుచేసుకుంది. సోంగ్ఖా హ్యాట్ హెయ్ జిల్లాలోని ఓ పాఠశాలలోకి చొరబడిన సాయుధ దుండగుడు.. కొంతమంది టీచర్లు, విద్యార్థులను బందీలుగా చేసుకున్నాడు. ఈ క్రమంలో ఓ టీచర్‌పై కాల్పులు జరిపినట్టు సమాచారం. ఓ మాజీ పోలీసు అధికారి ఈ దారుణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పాఠశాలను చుట్టుముట్టారు. లోపలున్న విద్యార్థులు, ఉపాధ్యాయులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు స్థానిక మీడియా వెల్లడించింది.



# చెలరేగిన రూథర్‌ఫోర్డ్

## ఇంగ్లండ్‌పై వెస్టిండీస్ ఘనవిజయం



టీ 20 ప్రపంచకప్ 2026లో భాగంగా ముంబై వేదికగా ఇంగ్లండ్, వెస్టిండీస్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 30 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకుంది. విండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. షెఫాన్ రూథర్‌ఫోర్డ్ (42 బంతుల్లో 76 పరుగులు) చెలరేగి ఆడటంతో కరేబియన్ జట్టు భారీ స్కోర్ చేసింది. అలానే రోస్టన్ చేజ్ (29 బంతుల్లో 34 పరుగులు), జాసన్ హోల్డర్(17 బంతుల్లో 33 పరుగులు) కూడా రాణించారు. హెట్మెయర్(23) రోవ్‌మన్ పావెల్(14) ఫర్వాలేదని పించారు. కెప్టెన్ షాయ్ హోప్ విఫలమయ్యాడు. ఇక ఇంగ్లండ్ బౌలర్లలో అదిల్ రషీద్, జేమీ ఓవర్టన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. జోఫ్రా ఆర్చర్, సామ్ కుర్రాన్ తలో వికెట్ సాధించా రు. మొత్తంగా విండీస్ జట్టు ఇంగ్లండ్ జట్టు ముందు 197 పరుగుల భారీ టార్గెట్‌ను ఉంచింది.

తడబడిన ఇంగ్లండ్

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ధాటిగానే ఆడింది. టాప్ ఆర్డర్ ఫర్వాలేదనిపించినా మిడిల్ ఆర్డర్ విఫలం కావడంతో వరుసగా వికెట్లు కోల్పోయింది. 19 ఓవర్లలో 166 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులో పిల్ సాల్ట్ 30, జాకబ్ బేతేల్ 33, సామ్ కుర్రాన్ 43 పరుగులతో రాణించారు.

# ఆస్ట్రేలియా శుభారంభం

## ఐర్లాండ్‌పై ఘన విజయం




కొలంబో: టీ20 ప్రపంచ కప్ 2026లో ఆస్ట్రేలియా శుభారం భం చేసింది. ఐర్లాండ్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో 67 పరు గుల తేడాతో ఆసీస్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 16.5 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌటైంది. జార్జ్ డాక్రెల్ (41, 20 బంతుల్లో 3 ఫోర్లు. 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. లోర్కాన్ టక్కర్ (24), రాస్ అడైర్ (12), మార్క్ ఆడైర్ (12) పరుగులు చేశారు. ఆస్ట్రేలియా బౌలర్ల లో నాథన్ ఎల్లిస్ 4. ఆడమ్ ఇంపా 4. కునెమన్ ఒక వికెట్ పడగొట్టారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. మార్కస్ స్థొయినిస్ (45, 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), జోష్ ఇంగ్లిస్ (37; 17 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), రెన్ షా (37, 33 బంతు ల్లో 2 ఫోర్లు) రాణించారు. దూకుడుగా ఆడిన కామెరూన్ గ్రీన్ (21, 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సు) ఎక్కువసేపు క్రీజులో నిలవ లేదు. ట్రావిస్ హెడ్ (6), గ్లెన్ మ్యాక్స్ వెల్ (9) విఫలమయ్యారు. కూపర్ కొన్నోలీ (11లి), బార్లెట్ (11) పరుగులు చేశారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ ఆడైర్ 2, మాథ్యూ హంప్రీస్, జార్జ్ డాక్రెల్, హ్యారీ టెక్టర్ తలో వికెట్ తీశారు.




# సచిన్ ఇంట పెళ్లి సందండి

**- మార్చి 5న అర్జున్ టెండూల్కర్ వివాహం**

**- ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం**

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూ ల్కర్ పెళ్లి నిశ్చయమైన సంగతి తెలిసిందే. తన స్నేహితురాలు సానియా చందోక్‌ను అతడు వివాహం చేసుకోబోతున్నాడు. మార్చి 5న ముంబయిలో వీరి వివాహం జరగనుంది. తన కుమారుడి వివాహ వేడుకకు రావాలంటూ సచిన్ కుటుంబసభ్యులతో కలిసి ప్రధాని నరేంద్రమోదీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. చందోక్ తల్లిదండ్రులు కూడా వెంట రాగా వారందరినీ మోదీ ఆత్మీయంగా పలకరించి కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మోదీతో ఇరు కుటుంబాలు కలిసి ఫొటో దిగాయి. అర్జున్, సానియా ప్రధానితో ప్రత్యేకంగా ఫొటో దిగారు. ఈ విషయాన్ని సచిన్ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్నాడు. ముంబయికి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలే సానియా. ఆమె కూడా వ్యాపారవేత్తే. ముంబయిలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది.



# 'సూపర్' హడల్..

## నరాలు తెగే ఉత్కం'టై'.. - ఆఫ్గాన్‌పై దక్షిణాఫ్రికా విజయం

టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా తొలిసారి నరాలు తెగే ఉత్కంఠ మధ్య బుధవారం సౌతాఫ్రికా, అఫ్గానిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ టెన్షన్ పుట్టించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్ లో సూపర్ ఓవర్‌లో సఫారీ జట్టు విజయం సాధించింది. దక్షిణాఫ్రికా గెలుస్తుందని అంతా అనుకున్న సమయంలో నూర్ అహ్మద్ సిక్సర్లతో అఫ్గాన్ జట్టును విజయానికి చేరువ చేశాడు. చివరి ఓవ ర్ తొలి బంతికే అవుటైనా అది నో బాల్ కావడంతో మ్యాచ్ ఒక్క సారిగా మలుపు తిరిగింది. సౌతాఫ్రికా జట్టు 20 ఓవర్లలో 187/6 చేయగా.. అఫ్గాన్ జట్టు కూడా 20 ఓవర్లలో 187/10 చేయడం తో సూపర్ ఓవర్ తప్పలేదు. ఈ సూపర్ ఓవర్ కూడా టై అయింది. దీంతో రెండో సూపర్ అనివార్యమైంది. రెండో సూపర్ ఓవర్‌లో సౌతాఫ్రికా 4 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. బుధవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదికగా సౌతాఫ్రికా, అఫ్గానిస్థాన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్గాన్ జట్టు బౌలింగ్ ఎంచుకుని సఫారీ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయిన సౌతాఫ్రికా 187 పరుగులు చేసింది. ప్రొటీస్ బ్యాటర్లలో ర్యాన్ రికెల్టన్ (61 పరుగులు), ఓపెనర్ క్వింటన్ డికాక్ (59 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. కెప్టెన్ ఎడెన్ మార్‌క్రమ్ (5), ట్రిస్టన్ స్టబ్స్ (1) విఫలమయ్యారు. డెవాల్డ్ బ్రెవిస్ (23), డేవిడ్ మిల్లర్(20) ఫర్వాలేదనిపించారు. అఫ్గానిస్థాన్ బౌలర్లలో అజ్మతు ల్లా ఒమర్జాయ్ 3, రషీద్ ఖాన్ 2, ఫజల్ హక్ ఫరూఖీ తలో వికెట్ తీసుకున్నారు.

**బెదరగొట్టిన ఆఫ్గాన్..గుర్బాజ్ ఊచకోత**

అనంతరం లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ జట్టు కూడా 187 పరుగులు చేసి.. ఆలౌటైంది. ఈ జట్టు పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయింది. గుల్బదీన్ నాయబ్, సెడీకుల్లా అట ల్ డకౌట్లు కావడంతో 52 పరుగులకే అఫ్గాన్ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. సరిగ్గా ఆ సమయంలోనే ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ సఫారీ బౌలర్లు ఊచకోత కోశాడు. 42 బంతుల్లోనే 84 పరుగులు చేసి విజయంపై ఆశలు కల్పించాడు. ఈ క్రమంలోనే 84 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కేశవ్ మహారాజ్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. అలానే చివర్లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (22), రషీద్ ఖాన్ (20), నూర్ అహ్మద్ (15 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడటంతో అఫ్గాన్ స్కోర్ సమం చేసి లక్ష్యానికి ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయింది. సౌతాఫ్రికా బౌలర్లలో ఎంగిడి 3 వికెట్లు తీసి అఫ్గాన్ విజయంపై నీళ్లు చల్లాడు. అలానే జాన్‌సే న్, రబాడ, లిండే, కేశవ్ మహారాజ్ తలో వికెట్ తీశారు.



**సూపర్ ఓవర్-1**

ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో ఫలితం కోసం సూపర్ ఓవర్ అనివార్యమైంది. ఇక్కడ కూడా ట్విస్ట్ చోటు చేసుకుంది. విజయం కోసం రెండు జట్లు చెలరేగి పోటీ పడ్డాయి. సూపర్ ఓవర్లలో కూడా ఇరు జట్లు 17 పరుగులు చేశాయి. దీంతో రెండో సూపర్ ఓవర్ తప్పలేదు.

*అఫ్గానిస్థాన్- 4, 6, 1, 1, 4, 1 (17 పరుగులు)*

*దక్షిణాఫ్రికా- 1, 6, ఔట్, 4, 0, 6 (17 పరుగులు)*

**సూపర్ ఓవర్-2**

ఇక రెండో సూపర్ ఓవర్‌లో కూడా అఫ్గానిస్థాన్ విజయం కోసం తీవ్రంగా శ్రమించింది. అయితే వారి వీరోచిత పోరాటం రెండో సూపర్ ఓవర్‌లో వృథా అయింది. 4 పరుగుల తేడాతో సఫారీ జట్టు విజయం సాధించింది. ఈ సూపర్ ఓవర్లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 23 పరుగులు చేసింది. అనంతరం అఫ్గాన్ జట్టు ఒక వికెట్ కోల్పోయి 19 పరుగులు మాత్రమే చేసింది.

*దక్షిణాఫ్రికా - 6, 1, 2, 6, 6, 2 (23 పరుగులు)*

*అఫ్గానిస్థాన్ - 0, ఔట్, 6, 6, 6, 1, ఔట్ (19 పరుగులు)*

# ఫ్లవర్ కాదు.. ఫైరే!



టాలీవుడ్ సినిమానుంచి పాన్ ఇండియా లెవెల్లో బాక్సాఫీస్‌ని రూల్ చేసే రేంజ్‌కి ఎదిగిన హీరోల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఒకరు. రాజమౌళి బ్రాండ్ లేకుండా బన్నీ తనకున్న పాన్ ఇండియా క్రేజ్‌ని తానే టెస్ట్ చేసుకొని మరీ పుష్ప–2తో ప్రూవ్ చేసుకున్నాడు. అయితే బన్నీ విషయంలో చాలానే తతంగం ఎప్పుడూ ఏదొకరకంగా నడుస్తూనే ఉంటుంది. అలా లేటెస్ట్‌గా తన 42 రూల్స్ అంటూ పెద్ద లిస్ట్‌తో సోషల్ మీడియా నిన్నటినుంచి ఊగిపోతోంది. అయితే అలాంటివేమీ లేవని బన్నీ టీం క్లారిటీ ఇవ్వడం, ఇంకా అనేకమంది తన సహా నటులు కూడా చెప్పడం జరిగింది. కానీ ఇక్కడ మ్యాటర్ ఏదైనప్పటికీ.. ప్రస్తుతం నేషనల్ లెవెల్లో అల్లు అర్జున్ నామ స్మరణ ఎక్కువగా వినిపిస్తుంది. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా జాతీయ మీడియాలో సైతం బన్నీ కోసమే చర్చ నడుస్తుంది. ఇదంతా ఎక్కడ వరకూ వెళ్లి ఆగుతుందో చూడాలి మరి.

# డాక్టరైన యాక్టర్ శ్రీలీల



టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల తన అందంతోపాటు అభినయం, డ్యాన్స్ స్టెప్పులతో తనకంటూ ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేసుకుంది. అయితే, ఆమె ఇప్పుడు తన జీవితంలో అద్భుతమైన మైలురాయిని చేరుకుంది. వెండితెరపై వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తాను చదువుకుంటున్న మెడిసిన్ విద్యను విజయవంతంగా పూర్తి చేసి ఎంబీబీఎస్ పట్టా అందుకుంది. సినిమా షూటింగులు, డ్యాన్స్ ప్రాక్టీస్‌వంటి బిజీ షెడ్యూల్స్ మధ్య కూడా చదువును ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆమె డాక్టర్‌గా పట్టా పొందడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దీనికి సంబంధించిన ఆమె గ్రాడ్యుయేషన్ ఫోటోలు, వీడియో లు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. శ్రీలీల డాక్టర్ పట్టా అందుకోవడంతో ఆమె అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సినిమాల్లో బిజీగా ఉంటూ కూడా ఆమె డాక్టర్ పూర్తి చేయడం నిజంగా అభినందనీయమంటూ వారు కామెంట్స్ చేస్తున్నారు.

# వెంకీ టైమింగ్‌కి అనుదీప్ రైటింగ్





స్టార్ హీరో విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ డైరెక్షన్‌లో ‘ఆదర్శ కుటుంబం’ అనే సినిమాలో నటిస్తున్నాడు. పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రానున్న సినిమా షూటింగ్‌ను వీలైనంత త్వరగా ముగించాలని చిత్ర యూనిట్ చూస్తోంది. ఇక ఈ క్రమంలో వెంకటేష్‌తో తన తరువాతి చిత్రాన్ని చేసేందుకు మరో డైరెక్టర్ కూడా రెడీ అవుతున్నాడట. ‘జాతిరత్నాలు’ చిత్రంతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ కేవీ అనుదీప్ తాజాగా ‘ఫంకీ’ చిత్రాన్ని రిలీజ్‌కు రెడీ చేశాడు. మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ హీరోగా కయాదు లోహర్ హీరోయిన్‌గా తెరకెక్కిన సినిమాను పూర్తి ఫన్ రైడ్‌గా అనుదీప్ తీర్చిదిద్దాడు. కాగా, ఈ సినిమా తర్వాత వెంకటేష్‌తో ఓ సినిమా చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే వెంకీకి స్క్రిప్ట్ వినిపించిన అనుదీప్, ఆయన సూచన మేరకు కొన్ని మార్పులు చేస్తున్నాడట. ఒక్కసారి ఫైనల్ స్క్రిప్ట్ రెడీ అవ్వగానే వెంకటేష్‌కు వినిపించి ఓకే చేయించుకునే ప్రయత్నం చేస్తాడట. ఇక ఈ కాంబినేషన్‌లో సినిమా అనగానే పక్కా ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అని అభిమానులు భావిస్తున్నారు. మరి ఈ కాంబోలో సినిమాను ఎప్పుడు ప్రకటిస్తారో వేచి చూడాలి.

# దర్శకురాలిగా వరలక్ష్మి..

‘క్రాక్’, ‘నాంది’ చిత్రాల్లో పవర్ఫుల్ పాత్రలతో తెలుగు ప్రేక్షకులకు ఆకట్టుకున్న కోలీవుడ్ నటి వరలక్ష్మీ శరత్ కుమార్. ఇప్పుడామె కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టారు. దర్శకురాలిగా ఓ ప్రాజెక్టును తెరకెక్కిస్తున్నానంటూ సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. తన చిత్రానికి ‘సరస్వతి’ టైటిల్ ఖరారైందని, త్వరలోనే థియేటర్లలో విడుదల కానుందన్నారు. ఈమేరకు పంచుకున్న వీడియో నవ్వులు పూయిస్తోంది. స్వీయ దర్శకత్వంలో నటించాల్సి వస్తే ఎలా ఉంటుందో ఈ వీడియోలో వినోదాత్మ కంగా చూపించారు. ప్రముఖ నటుడు శరత్ కుమార్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి వచ్చి నా.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్నారు వరలక్ష్మి. కెరీర్ ప్రారంభంలో కోలీవుడ్‌లో హీరోయిన్‌గా అలరించి.. తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారారు. ‘తెనాలి రామకృష్ణ బీఏబీఎల్’తో టాలీ వుడ్‌లోకి వచ్చిన ఆమె..నెగెటివ్ షేడ్ క్యారెక్టర్లకు,పవర్ఫుల్ పోలీసు ఆఫీసర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. నటిగా ‘సరస్వతి’తోపాటు ‘ధీరమ్’ అనే మలయాళ సినిమాలో నటిస్తు న్నారు.‘రిజానా–ఎ కేజ్డ్ బర్డ్’తో హాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నారు.




# పెళ్లి ఉదయ్‌పూర్.. రిసెప్షన్ హైదరాబాద్

విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న పెళ్లి వార్తలు మరోసారి సినీవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. కలిసి పలు సినిమాల్లో నటించిన తర్వాత వీరి మధ్య సాన్నిహిత్యం పెరిగిందని, ఆ పరిచయం ప్రేమగా మారిందన్నది సోషల్ మీడియా టాక్. ఇటీవలే సైలెంట్‌గా ఎంగేజ్ మెంట్ చేసుకున్నారనే ప్రచారం లేకపోలేదు. దీంతో ఈ జంట పెళ్లి ఎప్పుడు జరుగుతుందా? అని ఫ్యాన్స్, సినీ ప్రముఖులు ఆసక్తిగా చూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం విజయ్ – రష్మిక వివాహం ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ప్రైవేట్ ప్యాలెస్‌లో జరగనుంది. వేడుకకు కేవలం కుటుంబీకులు, అత్యంత సన్నిహితులే హాజరవుతారట. ప్రస్తుతం ఇద్దరూ షూటింగ్స్‌తో బిజీగా ఉన్నప్పటికీ, పెళ్లి కోసం ప్రత్యేకంగా గ్యాప్ తీసుకుని కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తున్నట్టు టాక్. వివాహం అనంతరం మార్చ్ 4న హైదరాబాద్ లోని ప్రముఖ హోటల్‌లో



గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేస్తారనీ వినిపిస్తోంది. రిసెప్షన్‌కు టాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ హీరోలు, దర్శకులు, నిర్మాతలు హాజరయ్యే అవకాశముంటుంది. విజయ్ –రష్మిక ఇప్పటికే ‘గీత గోవిందం’, ‘డియర్ కామ్రేడ్’ సినిమాల్లో కలిసి నటించి మంచి కెమిస్ట్రీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం మరోసారి ‘రణబలి’ ప్రాజెక్ట్‌లో కలిసి నటించబోతున్నట్టు సమాచారం. పెళ్లి తర్వాత కాస్త విరామం తీసుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. పెళ్లి వార్తలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన ఏదీ లేకున్నా, సోషల్ మీడియాలో మాత్రం వీరి వివాహం గురించి ఊహాగానాలు ఆగడం లేదు. నిజంగా ఈ జంట పెళ్లి బంధంలోకి అడుగుపెడుతుందా? లేక రూమరేనా? అన్నది క్లారిటీ రావాలి.

# మహాయోధుడిగా.. నిఖిల్

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా ‘స్వయంభు’. సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పాన్ ఇండియాస్థాయిలో అత్యున్నత సాంకేతిక విలు వలతో, 3డి ఫార్మాట్‌లో రూపొందిన టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ కృష్ణమా చారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985నాటి పరాక్రమవంతుడైన యోధు డిగా కనిపిస్తున్నాడు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భు తంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభానటేష్ హీరోయిన్లు. చిత్రానికి ‘కేజీఎఫ్’,‘సలార్’చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్నిసమకూర్చగా,ప్రముఖ సినిమా టోగ్రా ఫర్ కెకె సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. ‘కార్తికేయ–2’ విజ యం తర్వాత నిఖిల్ నటిస్తున్న చిత్రంపై టాలీవుడ్‌తోపాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

